
# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం, 27 మార్చి-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

- ఆలస్యం చేస్తే పరిస్థితులు మారిపోతాయి
- త్వరగా ఒప్పందానికి రావాలని హెచ్చరిక







## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్స్ పెరగాలి

- ఇక్కడ పరిశ్రమలు ఉన్నవారు ఇక్కడే వెచ్చించేలా చూడాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం.

హైదరాబాద్, మార్చి 26: తెలంగాణలో కంపెనీలు,పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడతానంటే ఎలా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ ఆర్ ఫండ్స్ మెరుగు గా లేవని అన్నారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ మరిన్ని తెలంగాణ లో ఖర్చు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సీఎస్ ఆర్ ఫండ్స్ ఎక్కువ ఖర్చు చేసిన వారిని గుర్తించి ప్రభుత్వం తరపున సత్కరించాలన్నారు. సీఎస్ ఆర్ ఫండ్స్ కోసం వెబ్సైట్ ఏర్పాటు చేయాలి..సీఎస్ఆర్ ఫండ్స్ ను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి..ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ ఫండ్స్ కోసం అనుసరిస్తున్న విధానాలను

మిగతా 3లో..

## ఆరోగ్యశ్రీపై అబద్దాలు చెప్పే ప్రయత్నం

- మైక్ కట్ చేయడం ద్వారా నిజాలు దాచారు
- మాజీమంత్రి హరీష్‌రావు విమర్శలు



హైదరాబాద్,మార్చి26 రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడు తోందన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా

మిగతా 3లో..

## కవిత కొత్త పార్టీ తెలంగాణ
# ప్రజా జాగృతి

- నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన
- రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం




నిజామాబాద్,మార్చి26 : తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన నిజామాబాద్ వేదికగానే ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించబోతున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమావేశంలో 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో కొత్త పార్టీని ఆమె ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది. రాబోయే నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, అజెండా , పార్టీ గుర్తును ప్రజల ముందుకు తీసుకురావాలని కవిత భావిస్తున్నారు. ఈ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కేవలం పార్టీ ప్రకటనకే పరిమితం కాకుండా, కవిత రాబోయే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే అంశంపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ ఎంపీగా ఐదేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉండటంతో, అదే పార్లమెంట్ పరిధిలోని బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం

మిగతా 3లో..

## రాష్ట్రంలో ఇంధన కొరత లేదు

- ప్రజలు ఆందోళనకు గురి కావద్దు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



హైదరాబాద్,మార్చి26 : రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. అలాగే 10,799 లీటర్లు సరఫరా చేశారని వివరించారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు. 22,127 కిలో లీటర్ల డీజిల్ ఆయిల్ కంపెనీలు సరఫరా చేశాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ 596 అవుట్ లెట్స్ ఉన్నాయని అన్నారు. ప్రతీ బంక్‌లో పౌరసరఫర, సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ అధికారుల బృందం పరిశీలన చేస్తుందని తెలిపారు. బుధవారం కంటే.. గురువారం పెట్రోల్ బంకుల వద్ద రద్దీ తగ్గిందన్నారు. రాష్ట్రంలో గృహ వినియోగంలో 1,28,24,087 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని.. ప్రతీ రోజు

మిగతా 3లో..

## దావోస్ పర్యటనలో రూ.2.19
# లక్షల కోట్లు పెట్టుబడులు

- విపక్షాల విమర్శలను తిప్పికొట్టిన శ్రీధర్ బాబు



హైదరాబాద్,మార్చి26 : దావోస్ పెట్టుబడులు, ఎంవోయూలపై శాసనసభలో విపక్ష సభ్యులు చేసిన విమర్శలను మంత్రి శ్రీధర్ బాబు తిప్పికొట్టారు. దావోస్ పర్యటనల్లో తెలంగాణకు రూ.2.19 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పెట్టుబడిదారులతో ప్రభుత్వం 44 ఎంవోయూలు కుదుర్చుకుందని వెల్లడించారు.ఈ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. దావోస్ పర్యటనల్లో 44 ఎంవోయూలు ప్రభుత్వం కుదుర్చుకుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. అసెంబ్లీలో దావోస్ పెట్టుబడులపై శ్రీధర్ బాబు మాట్లాడారు. పెట్టుబడులతో 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయని, 2024 దావోస్ లో 18 ఎంవోయూలు.. రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో 6 కంపెనీలకు భూముల కేటాయింపు జరిగిందని, భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం కేటాయించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మరో 3 కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూముల గుర్తింపు చర్యలు చేశామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో 11 కంపెనీలు కార్యకలాపాలు జరిగాయని అన్నారు. నిజామాబాద్ లో 681 సీట్ల సామర్థ్యంతో ఐటి టవర్ నిర్మించామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగాలు పనిచేస్తున్నారని అన్నారు. పెట్టుబడుల ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు, ఉపాధి లభిస్తుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## మార్కాపురం మృతులకు కేబినేట్ సంతాపం



- మృతుల కుటుంబాలకు 5లక్షల చొప్పున పరిహారం
- క్షతగాత్రులకు 2 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయం

మిగతా 3లో..

## జిఎస్‌టి సవరణ
# బిల్లుకు సభ ఆమోదం




- అధికారుల హోదాల పునర్వ్యవస్థీకరించిన ప్రభుత్వం

హైదరాబాద్,మార్చి26 : తెలంగాణ శాసనసభలో వస్తు సేవల పన్ను జిఎస్‌టి చట్ట సవ రణ బిల్లుకు ఆమోదం లభిం చింది. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ బి ల్లుపై విస్తృత చర్చ జరిగిన అనం తరం, సభ ఏకగ్రీవంగా దీనిని ఆమోదించింది. ప్రధానంగా పన్నుల విభాగంలోని ఉన్న తాధికారుల హోదాలను పునర్వ్యవస్థీకరించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మార్పులను తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న 'సేల్స్ టాక్స్ కమిషనర్' పోస్టు పేరును ఇకపై 'చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్'గా మార్చారు. అలాగే.. అదనపు కమిషనర్ (గ్రేడ్-1) హోదాను 'స్టేట్ టాక్స్ కమిషనర్'గా మారుస్తూ చట్ట సవరణ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలలోని ఉన్నతాధికారుల హోదాలతో తెలంగాణ అధికారుల హోదాలను సమన్వయం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

మిగతా 3లో..

## భద్రాచలం అభివృద్ధికి మొత్తం
# రూ.586 కోట్ల నిధులు

- మొదటి దశలో రూ.351 కోట్లతో పనులు ప్రారంభం
- నేటు కళ్యాణోత్సవానికి హాజరవుతున్న సిఎం రేవంత్
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



భద్రాచలం,మార్చి26 : శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపం వేదికగా స్వామివారి కళ్యాణం జరుగుతుంది. అందుకు సంబం ధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీసీతా రామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నారన్నారు. ఆయనకు ప్రజల తరఫున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

మిగతా 3లో..

## నేడు రాష్ట్రాల సిఎంలతో ప్రధాని
# వీడియో కాన్ఫరెన్స్

- పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్



న్యూఢిల్లీ,మార్చి26 : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు

మిగతా 3లో..

# వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో పురుగుల భోజనం



- ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధింపు

**న్యూఢిల్లీ,మార్చి26 :** వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. అతడికి అందించిన భోజనంలో పురుగులు కనిపించాయి. దీంతో రైల్వే శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధించింది. పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్ ప్రెస్‌లో ప్రయాణించిన రితేష్ కుమార్ అనే ప్రయాణికుడికి ఈ అనుభవం ఎదురైంది .రితేష్ కుమార్ మార్చి 15వ తేదీన పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో రితేష్‌కు అందిం చిన భోజనంలోని పెరుగులో పురుగులు కనిపించాయి. దీంతో షాకైన రితేష్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వే సిబ్బంది కూడా ఆ భోజనాన్ని పరిశీలించారు. ఈ మొత్తం తతంగాన్ని రితేష్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. వీడియోపై రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షలు జరిమానా విధిస్తున్నట్టు తెలిపింది. అలాగే ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానా విధించడంతో పాటు అతడి కాంట్రాక్టును కూడా రద్దు చేసింది. రైల్వే ప్రయాణికుల భద్రతకే తమ మొదటి ప్రాధాన్యం అని తేల్చి చెప్పింది.

# నిలకడగా సోనియా ఆరోగ్యం



- గంగారాం ఆస్పత్రి వైద్యుల వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి26 :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి 24వ తేదీ రాత్రి జ్వరం కారణంగా ఆమె న్యూఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరారు. ప్రత్యేక వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోనియా ఆరోగ్యానికి సంబంధించి గంగారాం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ విజయ్ స్వరూప్ గురువారం హెల్త్ బులిటిన్ విడుదల చేశారు. సోనియా ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. చికిత్సకు సోనియా ఆరోగ్యం సహకరిస్తోందని వెల్లడించారు. ఆమెకు సీనియర్ డాక్టర్ల బృందం చికిత్స అందిస్తోందని, ఇంకా పర్యవేక్షణ అవసరం ఉందని తెలిపారు. కాగా, డాక్టర్లు సిస్టమేటిక్ ఇన్‌ఫెక్షన్‌ను నయం చేయడానికి సోనియాకు యాంటీ బయాటిక్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మరికొన్ని రోజులు ఆమెను ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందించే అవకాశం ఉంది.

# మధ్యాహ్న భోజనంలో చేపలు



- మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్,మార్చి26 :** తెలంగాణలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపలు అందించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో బలమైన పశుసంపద ఉందని, గుడ్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నామని ఆయన తెలిపారు. మైనార్టీల విద్యకు భారీగా నిధులు వెచ్చిస్తున్నట్లు మంత్రి అజారుద్దీన్ తెలిపారు. పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, మైనార్టీ, సంక్షేమ శాఖల పద్దులను శాసనసభ ఆమోదించింది.

# బాలకృష్ణకు అరుదైన గౌరవం

- జీవిత సాఫల్య పురస్కారం అందచేత

**న్యూఢిల్లీ,మార్చి26 :** నందమూరి బాలకృష్ణ కెరీర్లో ఆయనకు మరో అరుదైన గౌరవం వచ్చి చేరింది. న్యూఢిల్లీలోని భరత్ మండపంలో అట్టహాసంగా జరిగిన అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం 2026 వేడుకల్లో బాలకృష్ణను 'భైరవ-రుద్ర' జీవిత సాఫల్య పురస్కారం'తో ఘనంగా సత్కరించారు. సినిమా రంగంలో యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న బాలకృష్ణ పౌరాణిక పాత్రల్లో తండ్రికి తగ్గ తనయుడిగా మెప్పించడమే కాకుండా, మాస్ ఎంటర్‌టైనర్లతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఆయనకే చెల్లింది. మార్చి 25న జరిగిన ఈ వేడుకలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా బాలయ్య ఈ అవార్డును అందుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'భగవంత్ కేసరి' 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో 'ఉత్తమ తెలుగు చిత్రం'గా నిలిచి సంచలనం సృష్టించింది. కళారంగానికి బాలకృష్ణ చేసిన విశేష కృషిని గుర్తిస్తూ 2025లో భారత ప్రభుత్వం దేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారం 'పద్మభూషణ్'తో గౌరవించింది. నటుడిగానే కాకుండా సేవా కార్యక్రమాలతో (బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి), రాజకీయ నాయకుడిగా కూడా బాలకృష్ణ తనదైన ముద్ర వేశారు.

# జీవన్ రెడ్డి పార్టీని వీడడం బాధాకరం

- లోక్‌భవన్‌లో మహాష్టమి వేడుకలు
- శక్తి స్వరూపిణి అమ్మవారి పూజ
- పూజలో పాల్గొన్న గవర్నర్ దంపతులు



**హైదరాబాద్, మార్చి 26:** శ్రీరామ నవమిని పురస్కరించుకుని చైత్ర నవరాత్రి మహాష్టమి వేడుకలు దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురువారం లోక్ భవన్ అధ్వర్యంలో తెలంగాణలో తొలిసారిగా సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లా తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గత 35 సంవత్సరాలుగా తాను ఈ వేడుకల్లో భాగస్వామ్యం అవుతున్నానని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను, ఈ పవిత్ర వేడుకను తొలిసారిగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లోనూ ఈ వేడుకలు తెలంగాణాలో కొనసాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. అమ్మవారి శక్తి స్వరూపమైన దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, మనలోని అజ్ఞానం, అహంకారం, దుర్గుణాలను తొలగించుకోవాలని సూచించారు. ఫలహార దీక్ష కేవలం ఆహార నియమం మాత్రమే కాకుండా, మనస్సు, శరీరం, ఆత్మలను శుద్ధి చేసే ఆధ్యాత్మిక పవిత్ర సాధనమని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ఆచారాలు నియమశీలత, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా సమాజంలో శాంతి, సోదరభావం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. పరస్పర గౌరవం, సహకారం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని సూచించారు. చివరిగా, మహాష్టమి సందర్భంగా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. వేడుకలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు,మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, మల్క కొమురయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్,అదనపు డీజీపీ మహేష్ భగవత్,జిల్లా కలెక్టర్ హరి చందన, రాజ్ భవన్ సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు

# చిన్నారులకు నాణ్యమైన విద్య.. పోషకాహారం

- ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో రేవంత్ రెడ్డి
- సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష



**హైదరాబాద్, మార్చి 26:** రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి తో ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం భేటీ అయ్యారు. రాష్ట్ర శాసనమండలి హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0-10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహారం లోపం.. విద్యాభ్యాసన స్థాయి సామర్థ్యలోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ సీఎం దృష్టిక తీసుకువచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్‌లో తలెత్తే ఆరోగ్య సమస్యలు.. ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను ఆయన సీఎంకు సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్ లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందజేసేందుకు పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. కార్తీక్ మురళీధరన్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకొని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, సెర్ప్ సీఈవో దివ్య, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణభాస్కర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రుతి ఓజా, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు



- స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి
- స్టేషన్ల వద్దకు ఆర్టీసీ సర్వీసులు పొడిగించాలి
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 26:** హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు.. వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్ఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.

# బస్సు ప్రమాద ఘటనపై రేవంత్ దిగ్భ్రాంతి

- మృతులు కుటుంబాలకు సంతాపం..
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ దిగ్భ్రాంతి



**హైదరాబాద్,మార్చి26 :** మార్కాపురం జిల్లా రాయవరం రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో 13 మంది మృతిచెందడం, 20 మందికి తీవ్రగా యాలు కావడంపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. నిర్మల్ నుంచి నెల్లూరు వైపు బస్సు వెళుతున్న నేపథ్యంలో మృతిచెందిన, గాయపడిన వారి వివరాలను తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని ఆజ్ఞాపించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ సీఎస్ సాయిప్రసాద్‌తో ఆయన మాట్లాడారు. ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్సు ప్రమాదంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని, ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం వద్ద తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, టిప్పర్ ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 13 మంది సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, ÷ర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొన్న వాహనాలు

- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ వెల్లడి



**మార్కాపురం,మార్చి26 :** జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఘటన జరిగిన సమయంలో బస్సు రాంగ్ రూట్‌లో ఉన్నట్టు ప్రాథమికంగా తెలుస్తోందన్నారు. బస్సు, టిప్పర్ రెండూ రాంగ్ రూట్‌లో ఉన్నాయన్నారు. టిప్పర్ డీజిల్ ట్యాంకర్‌ను బస్సు ఢీకొట్టడం వల్ల మంటలు చెలరేగాయని చెప్పారు. బస్సు స్టీరింగ్ స్ట్రక్ అవ్వడంతో అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొట్టినట్లు డ్రైవర్ చెప్పాడని, దీనిపై పూర్తి స్థాయిలో విశ్లేషించాల్సి ఉందని ఎస్పీ వెల్లడించారు.

# మార్కాపురం మృతులకు కేబినేట్ సంతాపం

- మృతుల కుటుంబాలకు 5లక్షల చొప్పున పరిహారం
- క్షగాత్రులకు 2 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయం





**అమరావతి,మార్చి26 :** ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ఏపీ కేబినెట్ భేటీలో చర్చించారు. మృతుల కుటుంబాలకు మంత్రివర్గం ప్రగాఢ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా బస్సు ప్రమాద బాధితులకు ఏపీ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. బస్సు ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మార్కాపురం మండలం రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 14 మంది సజీవ దహనం అయ్యారు. ప్రైవేటు బస్సు, టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 14 మంది చనిపోగా.. 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

## సిఎం రేవంత్ శ్రీరామనవమి శుభాకాంక్షలు



హైదరాబాద్, మార్చి 26: రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. భద్రాద్రి రామాలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధం చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.351 కోట్లు కేటాయించామన్నారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యం దేశమంతటికీ చాటేలా ఘనంగా నవమి వేడుకలు జరుపుకోవాలన్నారు. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్స్ పెరగాలి

అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సంస్థలు కనీసం 50 శాతం సీఎస్ఆర్ ఫండ్స్ కచ్చితం గా ఇక్కడే ఖర్చు పెట్టాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్ సిఎంఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి,సిఎంఓ ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి,సిఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్ ,ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

నుంచి ఆమె బరిలోకి దిగుతారని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోం ది.కవిత ఈ కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలలో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వంటి నేతలు కవిత నిర్ణయంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కవిత వెంట ఎంతమంది కీలక నేతలు నడుస్తారు, ఎంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఆమె పార్టీలో చేరతారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగే లక్ష్యంతో వస్తున్న ఈ కొత్త పార్టీ, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

## ఆరోగ్యశ్రీపై అబద్ధాలు చెప్పే ప్రయత్నం

పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసు పత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది' అని అన్నారు.

## నేడు రాష్ట్రాల సిఎంలతో ప్రధానివీడియో కాన్ఫరెన్స్

సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోడీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హోర్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## జిఎస్‌టి సవరణ బిల్లుకు సభ ఆమోదం

ఈ బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఈ మార్పుల వల్ల రాష్ట్రానికి ఎలాంటి ఆర్థిక భారం గానీ, నష్టం గానీ ఉండదని స్పష్టం చేశారు. కేవలం పరిపాలనాపరమైన సౌలభ్యం, మెరుగైన కమ్యూనికేషన్ , సమన్వయం కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అధికారుల హోదాల్లో మార్పులు చేయడం ద్వారా జీఎస్టీ అమలులో ఎదురయ్యే టెక్నాలజీ పరమైన ఇబ్బందులను అధిగమించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి వివరణతో సంతృప్తి చెందిన సభ, చివరగా బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## రాష్ట్రంలో ఇంధన కొరత లేదు



2,20,000 గ్యాస్ బుకింగ్స్ జరుగుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం ఒక్క రోజే 2,19,980 సిలిండర్లు సరఫరా చేశామన్నారు. వినియోగదారులు అధికంగా బుకింగ్స్ చేయ డం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడుతుందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు. అలాగే 1,03,275 పైప్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 2,78,418 క్యూబిక్ మీటర్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు పీఎన్జీ, సీఎన్జీని విస్తరించాల్సి ఉందని చెప్పారు. 24 గంటల్లో ప్లాంట్లకు అనుమతి ఇవ్వడంతో పాటు పలు రాయితీలు ఇవ్వాలనికేంద్రప్రభుత్వంఆదేశించిందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు.

# భార్యాభర్తలుగా నాటకాలు

- దొంగతనాలు చేసేందుకు జట్టుకట్టిన నేపాలీలు
- జూబ్లీహిల్స్ దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు



హైదరాబాద్, మార్చి 26: హైదరాబాద్‌లో సంపన్నుల ఇళ్లను టార్గెట్ చేసుకుని దోపిడీ చేస్తున్న నేపాలీ గ్యాంగ్ ఆట కట్టించారు పోలీసులు. ఇటీవల జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంట్లో పని మనుషుల్లా నటించి.. ఆ ఇంటికే స్కెచ్ వేసి దాదాపు 2 కోట్ల రూపాయలకు పైగా సొత్తు దోచుకు వెళ్లిన గ్యాంగ్‌ను పట్టుకున్నారు. వారి పేర్లు మహేష్ షాహీ, అప్సర. నిజానికి ఇద్దరికీ సంబంధం లేదు. కానీ.. నేపాల్ నుంచి హైదరాబాద్‌లో అడుగు పెట్టిన ఈ జంట.. చోరీలకు స్కెచ్చేశారు. అందుకోసం తాము భార్యభర్తలం అంటూ నాటకం మొదలు పెట్టారు. సంపన్నుల ఇళ్లను టార్గెట్ చేశారు. అక్కడ పని మనుషులుగా చేరేందుకు ప్రయత్నించారు. చివరకు జూబ్లీహిల్స్ రోడ్ నెం 25లోని ఓబుల్‌రెడ్డి స్కూల్ సమీపంలోని ప్లాట్ నెంబర్ 305లో పింగళి అనిరుధ్‌రెడ్డి, దీపికారెడ్డి దంపతుల ఇంట్లో వారికి ఉద్యోగం దొరికింది. ఇక అక్కడి నుంచి తమ స్కెచ్ అమలు చేసేందుకు ఎదురు చూశారు మహేష్ అండ్ అప్సర. ఇంటి యజమానులు ఎప్పుడెప్పుడు బయటకు వెళ్తుంటారు? ఎప్పుడు తిరిగి వస్తుంటారు? ఇలా ఈ విషయాలపై రెక్కీ నిర్వహించారు. మరోవైపు అనిరుధ్ రెడ్డి, దీపికా రెడ్డి దంపతులు ఊటీ, కూర్గ్ తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో మార్చి 5న వారిద్దరూ ఇంటికి తాళం వేసి వ్యాపారం పనిమీద ఊటీ వెళ్లారు. ఆ ఇంట్లో 45రోజుల క్రితం భార్యాభర్తమంటూ తోటమాలీగా పనిలో చేరిన మహేష్ షాహీ అలియాస్ ప్రకాష్, అప్సర అలియాస్ మాయ.. మరో ముగ్గురు నేపాలీ గ్యాంగ్ సభ్యుల సహకారంతో మార్చి 13న అర్ధరాత్రి తర్వాత కట్టర్స్, రాడ్స్‌తో ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లోని అల్మారాలను పగలగొట్టి సుమారు రూ.2కోట్ల విలువైన డైమండ్ నెక్లెస్‌లు, రాడో వాచ్‌లు, బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారు. ఈ ఘటనలో నిందితులను పట్టుకునేందుకు జూబ్లీహిల్స్ క్రైం పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రత్యేక బృందాలు దేశంలోని పలు నగరాలతో పాటు నేపాల్ సరిహద్దుల్లో మోహరించారు. కాగా చోరీ సొత్తును తలా కొంత పంచుకున్న నిందితులు ఢిల్లీతో పాటు ఇతర నగరాలకు పారిపోయారు. మహేష్ షాహీ, అప్సర పోలీసుల కళ్లుగప్పి సరిహద్దు దాటారు. దాదాపు 10 రోజులు వారికోసం కాపుకాసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నేపాల్ వెళ్లి నిందితులను పట్టుకున్నారు. స్థానిక కోర్టులో వారిని హాజరుపర్చిన అనంతరం విచారించగా చోరీ సొత్తులో కొంతభాగం తీసుకుని నరేష్ అనే వ్యక్తి ఢిల్లీకి వెళ్లాడని తేలడంతో అతడిని సైతం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహేష్ షాహీ, అప్సర ఇద్దరూ సహజీవనం చేస్తున్నారని.. చోరీ స్కెచ్‌లో భాగంగా భార్యాభర్తలుగా సంపన్నుల ఇంట్లో ప్రవేశిస్తుంటారని పోలీసుల విచారణలో తేలింది. కాగా చోరీలో పాల్గొన్న మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసుల వేట కొనసాగుతోందని తెలుస్తోంది. చోరీ అయిన సొత్తులో కొంత రికవరీ అయినప్పటికీ ఎక్కువ సొత్తు ఇంకా లభ్యం కాకపోవడంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు
- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, మార్చి 26: తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్-డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్?వసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

# శాసనసభ్యులకు క్రీడా పోటీలు

- 28 29 తేదీల్లో రెండ్రోజుల పాటు నిర్వహణ
- మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి వెల్లడి



హైదరాబాద్, మార్చి 26: రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి లు తెలిపారు. ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 నిర్వహణ సన్నాహక సమావేశం అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటి సారిగా నిర్వహించబోతున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.ఇందుకోసం శాసనసభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి , పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్ లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

## నేటినుంచి బ్యాంకులకు మూడ్రోజుల సెలవులు





హైదరాబాద్,మార్చి26: బ్యాంకులకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రాబోతున్నాయి . శుక్రవారం, శనివారం, ఆదివా రాల్లో బ్యాంకులు పని చేయవు. శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం సెలవు. నాలుగో శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు తెరుచుకోవు. దీంతో సోమవారమే బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయి. చెక్ క్లియరెన్స్‌లు, డాక్యుమెంట్ సబ్మిషన్, ఇతర వ్యక్తిగత సేవల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకుంటే సోమవారం వరకు ఆగాల్సిందే.

## ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

### ఆలస్యం చేస్తే పరిస్థితులు మారిపోతాయి

### త్వరగా ఒప్పందానికి రావాలని హెచ్చరిక



వాషింగ్టన్,మార్చి26 : ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారిపోతాయని హెచ్చరించారు. అమెరికాతో ఒప్పందం కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే, బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఆలస్యం కాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు.'ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది. తిరిగి పుంజుకునే అవకాశం లేదు. దీంతో వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. మరోవైపు మా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు చాలా తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది. ఆలస్యమైతే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా హెచ్చరించారు. అమెరికాతో చర్చల పట్ల ఇరాన్ భిన్నంగా ప్రకటనలు చేస్తోంది (ఎసజీని జా ఇనీన్గొ÷తిఇబి). ఘర్షణలు ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం ఉద్దేశం తమకు లేదని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది.

## మొక్కజొన్న కొనుగోలు చేయండి

### సిపిఎం నాయకుల ధర్నా

ఖమ్మం,మార్చి26 : మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో చింతకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మొక్కజొన్నకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మొక్కజొన్న గింజను కొనుగోలు చేయాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో సీపీఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, సీనియర్ నాయకులు వత్సవాయి రాములు, మద్దిని బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ పేరుతో మోసాలు

### ముఠాను అరెస్ట చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



హైదరాబాద్, మార్చి 26: ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేశ్ వెంకట్ రామన్, అభిషేక్, విలియమ్స్, మన్మీత్ శర్మ ముఠాగా ఏర్పడి రూ.26 కోట్ల మేర అక్రమ లాలాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. నకిలీ పేమెంట్ గేట్‌వేలను నిందితులు తయారు చేసినట్లు విచారణలో వెల్లడైంది. యూపీఐ, ఐఎంపీఎస్ కార్డ్ ట్రాన్సాక్షన్‌ల ద్వారా డబ్బులు మళ్లించినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. ప్రతి లావాదేవీపై 2 శాతం నుంచి 5శాతం వరకు కమిషన్ వసూలు చేసినట్లు గుర్తించారు. ఫేక్ కంపెనీల పేర్లతో మ్యూల్ ఖాతాలు సృష్టించి, నగదు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. సూర్యోదయ బ్యాంక్ ద్వారా పేమెంట్ గేట్‌వే సేవలు వినియోగించినట్లు ఆధారాలు సేకరించారు. నిందితుల నుంచి 4 ల్యాప్‌టాప్‌లు, 6 మొబైల్స్, 9 చెక్‌బుక్‌లు, రూ.6.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరికొంత మంది నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



## శ్రీ రామనవమి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు..

- ఎస్పీ మహేష్ బి. గితే.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వేములవాడ రాజన్న క్షేత్రంలో శుక్రవారం జరిగే సీతారాముల కళ్యాణోత్సవంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా 300 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ మహేష్ బి. గితే సమీక్ష సమావేశం నిర్వహించినారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. రాముల వారి కళ్యాణం సందర్భంగా వేములవాడ రాజన్న క్షేత్రానికి భారీగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, ఇన్‌చార్జ్ అధికారులు తమ క్రింది సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు.ఈనెల 28వ తేదీ శనివారం నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ రాజీ పడదగిన కేసులను గుర్తించాలని సూచించారు. అలాగే, సంబంధిత కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకునేలా ప్రోత్సహిస్తూ రాజీ కుదిరే విధంగా చైతన్యం కల్పించాలని పేర్కొన్నారు. ఈసమావేశంలో డిఎస్పీ లు నాగేంద్రచారి,శ్రీనివాస్,సిఐ లు శ్రీనివాస్, వీరప్రసాద్, మొగిలి,ఎస్.ఐ లు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురికి 4 ఏండ్ల జైలు శిక్ష..

- పోలీసుల కృషితో బాధితుడికి న్యాయం: ఎస్పీ డి.జానకి ప్రశంసలు

**బలగం టీవీ, మహబూబ్‌నగర్:**




మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. ఈ ఘటన నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 2023 జనవరి 31న చన్నారెడ్డిపల్లి గ్రామంలో భూవివాదం కారణంగా యెరుకలి వెంకటయ్య (ఏ1), యెరుకలి శ్రీను (ఏ2), యెరుకలి మల్లేష్ (ఏ3) కలిసి యెరుకలి చెన్నయ్యపై దాడి చేశారు. ముందస్తు ప్రణాళికతో ఏ1, ఏ3 కర్రలతో దాడి చేయగా, ఏ2 కత్తితో పొడిచాడు. ఈ దాడిలో బాధితుడు తల, భుజాలు, వెన్ను, చేతులపై తీవ్ర గాయాలు పొందాడు. ఈ ఘటనపై ఫిబ్రవరి 1, 2023న కేసు నమోదు చేయగా, నవాబ్‌పేట్ పోలీసులు వేగంగా స్పందించి మరుసటి రోజే నిందితులను అరెస్ట్ చేశారు. కేసు క్రైం నంబర్ 31/2023గా నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో విచారణ అనంతరం మహబూబ్‌నగర్ ప్రధాన సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వి. ఈశ్వరయ్య ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటు మొత్తం రూ.6,000 జరిమానా (ప్రతి ఒక్కరికి రూ.2,000) విధించారు. అదనంగా బాధితుడికి రూ.30,000 (ప్రతి నిందితుడు రూ.10,000 చొప్పున) పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసును సమర్ధవంతంగా విచారించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి జి. పురుషోత్తం (అప్పటి ఎస్ఐ), అదనపు ప్రజాప్రతినిధి మొహమ్మద్ అవేజ్, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ విక్రం, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు లైజన్ ఆఫీసర్ కె. నర్సింహులు మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపిఎస్ అభినందించారు. జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్నారని, నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

## నిర్మల్ జిల్లాలో ఏసీబీ వలలో ఎస్ఐ అశోక్

**రూ.20,000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన వైనం**

**బలగం టీవీ, నిర్మల్:**



నిర్మల్ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కీలక ఆపరేషన్ నిర్వహించి మామడ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ టి. అశోక్‌ను లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒక కేసును నమోదు చేయకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుడి నుండి రూ.20,000 లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.

ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో పట్టు బిగించి, పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఎస్ఐ క్వార్టర్స్‌లో లంచం స్వీకరిస్తున్న సమయంలో అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, రసాయన పరీక్షల్లో అది కలుషితంగా నిర్ధారించారు. ఈ ఘటనతో అధికార దుర్వినియోగం, అవినీతి ఆరోపణలు స్పష్టంగా బయటపడ్డాయి. నిందితుడైన ఎస్ఐను అరెస్ట్ చేసి, కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ప్రజలు ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే 9440446106 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.



## మార్కాపురం బస్సు ప్రమాదంలో హృదయ విదారక ఘటన..

**కోడుకుని కాపాడి ప్రాణత్యాగం చేసిన తల్లి**

**బలగం టీవీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం హృదయ విదారక ఘటనకు దారితీసింది. కనిగిరి మండలం మందాడివారిపల్లికి చెందిన ఉప్పు రమాదేవి (45) తన కొడుకు మనోహర్‌తో కలిసి బస్సులో స్వగ్రామానికి ప్రయాణిస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది.

ప్రయాణం మధ్యలో బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. పరిస్థితి విషమంగా మారుతున్నట్లు గమనించిన రమాదేవి, తన ప్రాణాల గురించి ఆలోచించకుండా ముందుగా తన కొడుకును రక్షించేందుకు ప్రయత్నించింది. అప్రమత్తంగా వ్యవహరించి మనోహర్‌ను బస్సు బయటికి తోసి అతని ప్రాణాలను కాపాడింది. అయితే, మంటలు వేగంగా వ్యాపించడంతో రమాదేవి బయటకు రావడానికి వీలు లేకపోయింది. చివరకు కొడుకు కళ్లముందే బస్సులో చిక్కుకుని సజీవదహనమైంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# సొంతింటి కల నిజం చేసుకోవాలనుకునే అర్హులకు సదావకాశం..

- రూ.5 లక్షల్లోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం
- కేవలం మూడు నెలల్లోనే పనులన్నీ పూర్తి
- 400 చదరపు ఫీట్లలో జిల్లాలోని ఆయా మండలాల్లో 11 మోడల్ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించిన గృహ నిర్మాణ శాఖ
- ఆధునిక సాంకేతికతో ఫిల్లర్ రూఫింగ్ విధానంలో స్లాబ్ నిర్మాణం




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఇల్లు లేని వారి సొంత ఇంటి కల నిజం చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతుంది. మోడల్ హౌస్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించింది. 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలతో ఇల్లు పూర్తవుతుందని స్పష్టం చేసింది గృహ నిర్మాణ శాఖ. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతోనే నూతన సాంకేతికత, అద్భుతమైన డిజైన్ లో స్లాబ్ తో ఇందిరమ్మ ఇల్లు పక్కాగా నిర్మించింది.

ప్రజా ప్రభుత్వం అర్హులైన వారి సొంతింటి కల నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. నిర్దేశించిన 400 నుంచి 600 చదరపు ఫీట్ల వరకు నిర్మించుకోవచ్చని, వారికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో నిర్మాణానికి అనుగుణంగా నేరుగా లబ్ధిదారు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా ఏర్పాట్లు చేసింది. పేదలకు 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలు ఇల్లు నిర్మించుకునేలా స్పష్టమైన కార్యాచరణ అవగాహన కల్పించాలని ఉద్దేశంతో గృహ నిర్మాణ శాఖ మోడల్ నిర్మాణాలను జిల్లాలో చేపట్టింది.

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో 11 నిర్మాణాలు పూర్తి..**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 11 మోడల్ ఇందిరమ్మ మోడల్ ఇండ్లను 400 చదరపు ఫీట్లలో ఒక ప్రణాళిక ప్రకారం కేవలం మూడు నెలల కాలంలోనే రూ. ఐదు లక్షలతో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

**ఇబ్బందులు దూరం చేసేందుకు కమిటీల సేవలు**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రతి మోడల్ హౌస్ లో ఒక హాల్, బెడ్ రూమ్ దానికి అటాచ్డ్ బాత్రూం, అలాగే కిచెన్ సదుపాయాలతో ఇంటిని పూర్తి చేశారు. గోడల నిర్మాణానికి సిమెంటు ఇటుకలు వినియోగించారు. కిటికీలు, దర్వాజలు చెదలు పట్టకుండా చాలా కాలం మన్నికగా ఉండేలా సిమెంటు ఫ్రేములు వినియోగించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారు. ఇంటి నిర్మాణ సామగ్రి, ఇతర ఇబ్బందులను దూరం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

**ఎండాకాలం చల్లగా.. చలికాలం వెచ్చగా ..**

ఇందిరమ్మ మోడల్ హౌస్ లు ఎండాకాలంలో చల్లగాను.. చలికాలంలో వెచ్చగా ఉండేలా సాంకేతికతను ఉపయోగించారు. స్లాబు నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని వినియోగించారు. ఇందులో సాధారణ ఇళ్లతో పోలిస్తే స్లాబ్ నిర్మాణంలో 40 శాతం ఖర్చు ఆదా అవుతుంది. కాంక్రీట్, ఐరన్ తక్కువగా ఉపయోగిస్తారు. స్లాబ్ చూడడానికి కూడా ఎంతో అందంగా కనిపిస్తుంది.

**దీర్ఘకాలం పాటు మన్నికగా ఉండేలా..**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 లక్షలలోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. నాణ్యతలో కూడా ఇలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేశారు. దీర్ఘకాలం పాటు నిలిచి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయం లోనే ఇంటి నిర్మాణాన్ని చేశారు.

**ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ..**

జిల్లాలోని అర్హులైన వారు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఐదు లక్షల తోనే పూర్తిచేసేలా ప్రతి మండల కేంద్రం అలాగే మున్సిపాలిటీలో హౌసింగ్ అధికారులు పూర్తిస్థాయి సహకారం అందిస్తారు. అర్హులైన వారందరూ వారి సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకునే అవకాశం ఉంది.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..



- ఏప్రిల్ 1 నుంచి మన ఇసుక వాహనంతో సరఫరా
- ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చే నెల (ఏప్రిల్) ఒకటో తేదీ నుంచి మన ఇసుక వాహనం ద్వారా నిర్మాణ పనులకు ఇసుక సరఫరా అవుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం, ఇసుక సరఫరా తదితర అంశాలపై జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మన ఇసుక వాహనం ద్వారా ఇసుక సరఫరా చేయాలని సూచించారు. జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్ ల నుంచే ఇసుక తరలించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఇబ్బందులు రావద్దని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని, ఆయా ఇసుక రీచ్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ఇటుక ఇటుక బట్టీలు నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకోవాలని అన్నారు. నిర్ణీత సమయంలోనే ఇసుక సరఫరా చేయాలని ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం నిఘా పెడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, డీఎస్పీ నాగేంద్రచారి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, నీటి పారుదల, భూగర్భ జల, అధికారులు, తహసీల్దార్లు, ఎస్ హెచ్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ ప్రభుత్వ పాఠశాలలో ట్విన్నింగ్ స్కూల్ కార్యక్రమం..

**బలగం టీవీ, వేములవాడ:**




వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్విన్నింగ్ స్కూల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రభుత్వ పాఠశాల మరియు ఎంపీయూపీఎస్ నాంపల్లి పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యా, క్రీడా మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పరస్పరం పరిచయాలు పెంచుకొని అనుభవాలను పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పరస్పర సహకారం పెంపొందుతాయని వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారత్నం, ఎంపీయూపీఎస్ నాంపల్లి ప్రధానోపాధ్యాయురాలు వత్సల తెలిపారు. పాఠశాలల మధ్య విద్యా అనుభవాల మార్పిడి ద్వారా బోధన విధానాలు మరింత మెరుగుపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీయూపీఎస్ నాంపల్లి ఉపాధ్యాయులు ఉమాదేవి, రజిత, వినయ్ కుమార్, కమలాకర్ రెడ్డి, శైలజ, సనా తదితరులు పాల్గొన్నారు.



## సిరిసిల్ల నేత పరిశ్రమను సందర్శిస్తా

- గవర్నర్ శివప్రకాశ్ శుక్లా

**బలగం టీవీ, హైదరాబాద్**

సిరిసిల్ల నేత పరిశ్రమ పరిస్థితులు, అక్కడి కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో సిరిసిల్లను సందర్శిస్తానని రాష్ట్ర గవర్నర్ శివప్రకాశ్ శుక్లా తెలిపారు. సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు హరిప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల నేత పరిశ్రమ గురించి గవర్నర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు మేలు జరిగేలా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీర, జీ--20 లోగోను నేసి ప్రధాని ప్రశంసలు పొందిన హరిప్రసాద్‌ను గవర్నర్ సత్కరించారు. చేనేత రంగంలో ఆయన చేసిన వినూత్న ప్రయోగాలను అభినందించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ గవర్నర్ శివప్రకాశ్ శుక్లాకు వెదురుతో తయారు చేసిన సిరిసిల్ల మరమగ్గం జ్ఞాపికను బహుకరించారు.



## వేములవాడలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాలు

- 8వ రోజు పూజలు వైభవంగా

**బలగం టీవీ, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా 8వ రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామివారికి పంచోపనిషత్ విధానంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి, పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు చేశారు. శ్రీ సీతా చంద్రరామ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా యాగశాలలో పుణ్యాహవచనం, మూలమంత్ర హోమం, పరివార దేవతల హోమాలు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్యాదాతలుగా మరింగంటి విజయసారథి--కర్ణ దంపతులు పాల్గొన్నారు. వేద పండితులు ఆచార్యులుగా పూజలను నిర్వహించారు. శ్రీరామ నవరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు రామాయణ పారాయణం, శ్రీరామ గీత, ఆధ్యాత్మిక రామాయణ పారాయణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ రోజు సాయంత్రం 4.30 గంటలకు శంకరమఠంలో రామాయణ ప్రవచనం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలను అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ఎలాంటి లోటు లేకుండా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఇద్దులాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇద్దులాపూర్ గ్రామంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అంబాల కుమార్ (35) గురువారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరి వేసుకున్నారు. విషయం గమనించిన భార్య వసంత వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. అనంతరం వారు హుటాహుటిన కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఆదిత్య, అక్షయ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# సమన్వయంతో డ్రగ్స్ నియంత్రించాలి..



- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

అన్ని శాఖల అధికారులు సమన్వయంతోడ్రగ్స్ ను నియంత్రించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై బుధవారం కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్ డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. 14416 ఆన్లైన్ ద్వారా 24/7 టెలీ మానస్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. మానసికంగా ఇబ్బంది పడే వారికి ఫోన్ ద్వారా కౌన్సెలింగ్ ఇస్తారని తెలిపారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలపై పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ షాప్ లలో తనిఖీ చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించాలని, డీ అడిక్షన్ సెంటర్ లో చికిత్స అందించాలని కలెక్టర్ సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్స్పెక్టర్ కు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ రజిత, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, డీఐఈఓ శరత్ కుమార్, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, వ్యవసాయ, డ్రగ్, ఫుడ్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



## వేములవాడలో రామకళ్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు..

- **పార్కింగ్ ప్రాంగణం పరిశీలించిన ఈవో.**

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆలయ పార్కింగ్ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. కళ్యాణం జరగనున్న వేదిక, చలవ పందిళ్లు, ఎల్ఈడీ స్క్రీన్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, అన్నప్రసాదం పంపిణీ చేసే ప్రదేశం, కళ్యాణం అనంతరం ఓడి బియ్యం సమర్పించి దర్శనానికి వెళ్లే మార్గం వంటి ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే భక్తులు వేదిక ముందు కూర్చునేలా ఏర్పాటు చేసిన సెక్టార్లు, త్రాగునీటి సదుపాయం, శానిటేషన్, బారికేడ్లు, ప్రవేశ ద్వారాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. రామకళ్యాణానికి ఒక్కరోజు ముందే పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు భీమేశ్వర స్వామి ఆలయంలో బాగా దర్శనం అవుతుందా ఎలా చేసుకుంటున్నారో కూడా ఈవో పరిశీలించారు. కళ్యాణోత్సవానికి చేసిన ఏర్పాట్లపై భక్తులతో మాట్లాడి, ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్‌పై స్పీకర్ సీరియస్..

**బలగం టీవీ, హైదరాబాద్:**

కూకట్ పల్లి నల్లచెరువు శిలాఫలకంపై ప్రోటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్ నేతలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు. ఓడిపోయిన వ్యక్తి పేరు వేయడంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వారం రోజుల్లో మార్చకుంటే శిలాఫలకాన్ని కూల్చేస్తానని హెచ్చరించారు. దీనిపై స్పందించిన స్పీకర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం వెంటనే స్థానిక ఎమ్మెల్యే మరియు ఎమ్మెల్సీల పేర్లతో కొత్త శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధనపై సమీక్ష



- **డీఎంహెచ్‌వో డా. రజిత**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రజిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం గురువారం రోజున నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, నిర్దేశిత లక్ష్యాల సాధనపై విస్తృతంగా సమీక్షించారు. గర్భిణీ స్త్రీల నమోదు, ప్రమాదకర గర్భిణీలకు సమయానుకూల పరీక్షలు నిర్వహించడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీసం 70 శాతం సాధారణ ప్రసవాలు జరగేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అలాగే ప్రసవానంతరం తల్లులు, శిశువులకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

పిల్లలకు ఐదు సంవత్సరాల లోపు అన్ని వ్యాధి నిరోధక టీకాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్సీడీ కార్యక్రమంలో భాగంగా రక్తపోటు, మధుమేహం, వివిధ రకాల క్యాన్సర్‌లను ముందస్తుగా గుర్తించే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. టీబీ నిర్మూలన కార్యక్రమంలో 60 సంవత్సరాలు పైబడినవారు, బరువు కోల్పోయినవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారిని గుర్తించి తేమడ పరీక్షలు, చెస్ట్ ఎక్స్‌రేలు నిర్వహించాలని తెలిపారు. ఆర్బీఎస్కే కార్యక్రమంలో భాగంగా హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని ఆదేశించారు.

వడదెబ్బ (సన్ స్ట్రోక్) నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, బయట పని చేసే కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గుండెజబ్బులున్నవారు వడగాలుల సమయంలో బయట తిరిగినట్లయితే వారి శరీరాలు వేడి, శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలు ఉండడంతో పాటు, గందరగోళం, చిరాకు, తలనొప్పి, కండరాల బలహీనత, వికారం, వాంతులు, గుండె స్పందన పెరగడం, శ్వాస పెరగడం వంటి వల్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చల్లని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవడం, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం, చల్లని నీటితో శరీరాన్ని తుడవడం, అవసరమైతే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను తప్పకుండా సాధించాలని, విఫలమైతే తగిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులకు హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డా. సంపత్, డా. అనిత, డా. రామ కృష్ణ, డా. నయీమా మరియు డీపీఓ రాజేందర్ లు పాల్గొన్నారు.

## శివంగి ఆత్మీయ పురస్కారం అందుకున్న జానపద గాయని కోల స్నేహ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరేళ్ళ గ్రామానికి చెందిన జానపద గాయని, రచయిత కోల స్నేహ తన ప్రతిభతో మరోసారి గుర్తింపు పొందింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పీపుల్స్ మీడియా పాయింట్ సంస్థ ప్రదానం చేసిన "శివంగి ఆత్మీయ పురస్కారం"ను ఉత్తమ జానపద రచయిత, గాయనిగా అందుకుంది. చిన్నప్పటి నుంచే తన తల్లి నేర్పిన పాటలతో సంగీతంపై ఆసక్తి పెంచుకున్న స్నేహ, జానపద గేయాలే ప్రాణంగా ముందడుగు వేసింది. ఇప్పటివరకు వందకు పైగా పాటలు రాసి పాడుతూ, జానపద రంగంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా "అల్లిబిల్లి సోకులాడి సిట్టమ్మి" పాటతో ప్రజల మనసులు గెలుచుకుంది. తన విజయానికి తల్లిదండ్రులు విజయ, మల్లేశం, భర్త వినయ్ కుమార్, అత్తమామలు, సోదరుడు ఇచ్చోడ శేఖర్ ప్రధాన కారణమని, వారి ప్రోత్సాహం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని ఆనందం వ్యక్తం చేసింది.




# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సన్నాహాలు..

- **ప్రతి బూత్‌కు బూత్ లెవల్ ఏజెంట్ల నియామకానికి ఆర్డీఓ పిలుపు**
- **భారత దేశంలో ఎక్కడైనా ఒక వ్యక్తికి ఒకే ఓటు అనే ప్రభుత్వ కార్యక్రమం త్వరలో ప్రారంభం..!**
- **వేములవాడ ఆర్డీఓ ఆర్.వి. రాధాబాయి**



**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేములవాడ ఆర్డీఓ ఆర్.వి. రాధాబాయి అధ్యక్షతన వేములవాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ.. "భారతదేశంలో ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం చేపట్టబడుతుంది" అని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాలకు ప్రభుత్వం ఇప్పటికే బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓ) నియమించిందని వెల్లడించారు. ఇక ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తమ తరపున ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించి, వారి వివరాలను త్వరితగతిన తహసీల్దార్ కార్యాలయానికి సమర్పించాలని ఆర్డీఓ సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో లోపాలు సవరించి, పారదర్శకతను పెంచే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వి. నిత్యానందరావు, బీఆర్ఎస్‌కు చెందిన పొలాస నరేందర్, బీజేపీకి చెందిన పిన్నింటి హన్మాండ్లు, టీడీపీకి చెందిన చింతలకోటి రామస్వామి గౌడ్, తహసీల్దార్ ఎ. జయంత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.




## బిఆర్ఎస్ నాయకులను వేధిస్తే ఊరుకొం..

- **ప్రభుత్వ అణిచివేత ధోరణిని, ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడతాం..**
- **బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గజభీంకార్ రాజన్న**

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత వైఖరితో తెలంగాణ ఉద్యమ సారధి తెలంగాణ రాష్ట్ర సాధకులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని విచారణ పేరుతో వేధిస్తున్నారని నిరసనగా ఫిబ్రవరి ఒకటో తేదీన రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా తంగళ్ళపల్లి మండలంలో అన్ని గ్రామాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసినందుకు తంగళ్ళపల్లి మండలంలో 18 మంది బిఆర్ఎస్ పార్టీ నాయకుల పైన కేసులు బుక్ చేసి బుధవారం రోజు నోటీసులు ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గజభీంకార్ రాజన్న మాట్లాడుతూ.. ఇటువంటి కేసులకు భయపడేది లేదని, బిఆర్ఎస్ నాయకులను వేధిస్తే ఊరుకునేది లేదని, మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకత్వాన్ని వేధించడం మానుకొని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని మేం డిమాండ్ చేస్తున్నమన్నారు. ప్రతిపక్ష నాయకులుగా ప్రియతమ నేత కేటీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న అణిచివేత ధోరణిని, ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని తెలియజేస్తున్నాం అన్నారు. తంగళ్లపల్లి మండల బిఆర్ఎస్ నాయకులకు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లి రాంమోహన్ సంఘీబావం ప్రకటించారు.

## ఉధ్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

ఆర్ ఏ ఎం పి ప్రాజెక్ట్ కింద జిల్లా పరిశ్రమల కేంద్రం, రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో ఈ డి సి బృందం ఎల్లారెడ్డిపేట ఐటీఐ కాలేజీలో ఉధ్యమ్ రిజిస్ట్రేషన్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి. హనుమంతు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు ఉధ్యమ్ రిజిస్ట్రేషన్‌ను ఎలా చేసుకోవాలో వివరించారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కలిగి ఉండటం వల్ల ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రుణ సౌకర్యాలు వంటి అనేక ప్రయోజనాలు పొందవచ్చని అన్నారు.

ప్రతి ఎం ఎస్ ఎం ఈ యజమాని తప్పనిసరిగా ఉధ్యమ్ రిజిస్ట్రేషన్ పొందాలని, ఈ ప్రక్రియ పూర్తిగా ఉచితమని అన్నారు. రిజిస్ట్రేషన్‌కు సహాయం అవసరమైతే కలెక్టరేట్‌లోని ఈ డి సి కార్యాలయాన్ని సంప్రదించాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ డి సి మేనేజర్ కె. జయంత్, అసిస్టెంట్ మేనేజర్ టి. వెంకట శివసాయి, గెస్ట్ ఫ్యాకల్టీలుగా బి. విజయ్ కుమార్ (ఫెసిలిటేటర్), జి. వంశీకృష్ణ లు పాల్గొన్నారు.



## శ్రీరామనవమి సందర్భంగా రామోజీపేటలో పట్టు వస్త్రాల సమర్పణ..

- **రామోజీపేట రామాలయంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ విద్య దంపతులు..**

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని రామోజీపేట గ్రామంలో శ్రీసీతారామ స్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ వారి సతీమణి విద్య తో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయమే స్వామివారి ఆలయానికి సతీ సమేతంగా చేరుకున్న సంగీతం శ్రీనివాస్ ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదోక్త ఆశీర్వచనం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదు

- **డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 22 మంది మందు బాబులకు జరిమానాలు..**
- **సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్.**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 22 మంది మందు బాబులు పట్టుబడగా వారిని సిరిసిల్ల పోలీసులు ఈరోజు కోర్టులో ప్రవేశపెట్టగా ముగ్గురికి ఒక్కొక్కరికి 1000 రూపాయలు, ఇద్దరికి ఒక్కొక్కరికి 1500 రూపాయలు,10 మందికి ఒక్కొక్కరికి 2000 రూపాయలు, ఒక్కరికి 2500 రూపాయల జరిమాన, 05 గురికి ఒక్కొక్కరికి 5000, ఒక్కరికి 7000 రూపాయల జరిమానలు విధిస్తూ మేజిస్ట్రేట్ జయ శ్రీ తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు..

సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన మందు బాబులకు ట్రాఫిక్ ఎస్.ఐ దిలీల్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ.. ప్రతి రోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితంద్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెల్లింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి



పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతయని,ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ట్రంప్ మూర్ఖానికి ప్రపంచదేశాలు మూల్యం !



**బలగం టీవీ, హైదరాబాద్**

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఈ సంవత్సరపు అతిపెద్ద విలన్లుగా ప్రపంచంలో అవతరించారు. తమ యుద్ధ దాహానికి ప్రపంచాన్ని బలి తీసుకున్నారు. ఆయుధ సంపత్తి ఉందికదా అని ఇరాన్‌పై విచ్చలవిగిగా జరిపిన బాంబు దాడిలో ఇప్పటికే ఇరాన్ బాగా దెబ్బతింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ దేశాలు కూడా దెబ్బిన్నాయి. ఈ క్రమంలో ఏం సాధించారో ట్రంప్ ప్రపంచానికి చెప్పాలి. గతంలో ఇరాక్‌లో ఇలాంటి దడి చేసి సద్దాం హెస్సేన్‌ను ఉరేశారు. ఇక్కడ ఖమేనీని చంపేశారు. వీరి యుద్ధాలు ప్రపంచానికి సంకటంగా మారాయి. ట్రంప్ తీరుతో ప్రపంచం కొరివితో తలగోక్కున్నట్లుగా తయారయ్యింది. ఇరాన్‌ను లొంగదీసుకుంటానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. క్రమంగా వెనక్కి జారుకున్నారు. చర్చలు జరుగుతున్నాయని, ఐదు రోజులపాటు యుద్ధానికి విరామం ఇస్తున్నామని ప్రకటించారు. అయితే, ఇరాన్ మాత్రం.. యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ.. తమకూ అమెరికాకు మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని, తాము చర్చలకు సిద్ధంగా లేమని స్పష్టం చేసింది. మీరు దాడులు మొదలు పెట్టి మీరే షరతులు పెడతారా అని నిలదీసింది. మేమూ షరతలు పెడతామని చెప్పింది. మొత్తమ్మీద, ట్రంప్ మాటలకు విశ్వసనీయత లేద ని, రోజుకో మాట మాట్లాడటమే ఆయన తీరని మరోసారి రుజువైంది. ఏదేమైనా.. ట్రంప్ వెనక్కి తగ్గటం మాత్రం కాదనలేని వాస్తవం. ట్రంప్ తీరుపై స్వదేశంలోనూ తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇజ్రాయిల్ కోల్పోయిందేమీ లేదు క ఆనీ, అమెరికా భారీగా నష్టాన్ని మూటగట్టుకుంది. ఓ రకంగా చెప్పాలంటే యుద్ధంలో ఇరాన్ గెలిచిందనే చెప్పాలి. ఇరాన్ మీద కయ్యానికి కాలు దువ్వినప్పుడు అమెరికా-ఇజ్రాయెల్ లకు ఓ స్పష్టమైన లక్ష్యం లేదు. ఖమేనీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని పడగొడతామని ఒకసారి, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా చూడటం అని మరోసారి, ఇరాన్ నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందని, ఆ దేశాన్ని లొంగదీసుకుంటామని ఇంకోసారి.. ఇలా పూటకో మాట చెప్పారు ట్రంప్. మరోవైపు, తమ మీద రుద్దిన ఈ యుద్ధాన్ని ఎదుర్కొని తమ దేశ సమగ్రతను కాపాడుకునే ఏకైక, స్పష్టమైన లక్ష్యంతో ఇరాన్ యుద్ధంలోకి దిగింది. అంతులేని యుద్ధాలకు ముగింపు పలుకుతానని, అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అమెరికాకు ఏ విధంగానూ అవసరం లేని యుద్ధం చేస్తున్నారన్న భావన అమెరికన్లలో వ్యాపించింది. తాము కట్టిన పన్నుల్ని నెతన్యాహూ కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగాయి. స్థిరచిత్తం లేని ట్రంప్ మాటలతో, చేతలతో అమెరికా అధ్యక్ష పదవి ఓ జోకులాగా తయారైంది. స్వయంగా ట్రంప్ మద్దతుదారులు కూడా ఈ యుద్ధాన్ని సమర్థించటం లేదు. సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ రోజురోజుకీ దిగజారుతోంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, తాజాగా వెనక్కి తగ్గారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనెజువెలాలో అధ్యక్షుడు మదురో అధికారిక నివాసంపై దాడి చేసి రాత్రికి రాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్.. ఇరాన్ మీద కూడా అదే ఎక్స్మి-లాన్ అమలు చేయాలని భావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ రాజధాని టెహ్రాన్‌లో సైనిక, పౌర ఉన్నతాధికారులతో సమావేశమైన తరుణంలో వారి మీద అమెరికా, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా బాంబులు కురిపించాయి. వారిని హత్య చేసి యుద్ధం ప్రారంభించాయి. ఖమేనీ హత్య తర్వాత.. అప్పటి వరకూ ఉన్న అంతర్గత విభేదాలు, ప్రభుత్వం మీద ఉన్న అసమ్మతిని కూడా పక్కనపెట్టి.. దేశ పరిరక్షణకు యావత్ ఇరాన్ ఒక్కటైంది. ఆ దేశంలోని ప్రతీ పట్టణంలో.. ఓవైపు క్షిపణులు, బాంబులు పడుతున్నా కూడా బెదరకుండా.. రోడ్ల మీదికి పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ ర్యాలీలు జరిపారు. ఇప్పటికీ ఇవి కొనసాగుతున్నాయి. ఇరాన్ బలాబలాలేమిటి అన్నది సమగ్రంగా సమీక్షించకుండానే ట్రంప్ ఈ యుద్ధంలోకి దిగారు. అమెరికా సైన్యాధికారులతో సంప్రదించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని శక్తిమంతమైన యూదు లాబీ మాటలువిని ట్రంప్ యుద్ధం నిర్ణయం తీసుకున్నారని స్వయంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం డైరెక్టర్ జో కెంట్ వెల్లడించి నిరసనగా పదవికి రాజీనామా చేశారు. గల్ఫ్ మొత్తానికి యుద్ధాన్ని విస్తరిస్తుందని ట్రంప్, నెతన్యాహు ఊహించి ఉండరు. ఇక హార్ముజ్ జలసంధిని అడ్డుకోవటం ద్వారా ఇరాన్ తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. దీంతో యుద్ధం ప్రభావం యావత్ ప్రపంచం మీద పడింది. దీనికి ట్రంప్ దూకుడే కారణం. ప్రపంచం యావత్తూ గ్యాస్, ఇంధనాల కొరతతో అల్లుడుతోంది. ఆయా దేవాల ఆర్థిక స్థితి దారుణంగా పడిపోయింది. ఇప్పట్లో ఈ నష్టాల నుంచి కోలుకోవడం ఎవరికైనా కష్టమే.

# అమెరికాను ఎదుర్కొనేలా ఇరాన్ ఎత్తులు

- **ఖర్గ్ ఐలాండ్‌లో బారగీ మందుపాతరలు**

**బలగం టీవి, టెహ్రాన్**

ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్ ను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా తన బలగాలను మోహరిస్తోందని వార్తలు వస్తున్న ఈనేపథ్యంలో ఖర్గ్‌ను రక్షించుకునేందుకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం అమెరికా దళాలను అక్కడ అడుగుపెట్టనీయకుండా ఇరాన్ భారీగా మందుపాతరలు అమర్చినట్లు సమాచారం. వాటితో విధ్వంసకర ఉచ్చులు పన్నుతోందని తెలుస్తోంది. అంతేకాకుండా అక్కడికి భారీగా బలగాలను కూడా తరలిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనం వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలోని ఓ దేశం సహకారంతో ద్వీపాలను ఆక్రమించు కోవాలని మా శత్రువులు సన్నాహాలు చేస్తున్నారన్న నిఘా సమాచారం ఉంది. శత్రువుల కదలికలను మేం

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. శత్రువు ఒక్క అడుగు ముందుకువేసినా.. పశ్చిమాసియాలోని ఆ దేశంలోని కీలక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఎడతెగని దాడులు చేస్తాం అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఎంబీ ఘలిబాఫ్ ఇప్పటికే హెచ్చరికలు చేశారు. అమెరికా సైనికులు, కమాండర్ల ఆచూకీ చెప్పండంటూ పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ (ఎసజీని) విజ్ఞప్తి చేసింది. అమెరికా స్థావరాలపై తాము దాడులు చేస్తుండటంతో అక్కడున్న యూఎస్ సైనికులు ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని ఇరాన్ వెల్లడించింది. పశ్చిమాసియా దేశాల ప్రజలు వారి ఆచూకీని వెల్లడించాలని కోరుతున్నాం. అలాగే మీ భద్రత కోసం వారిని బహిష్కరించండని అడిగింది. తమ దాడుల్లో దెబ్బతిన్న అమెరికా



స్థావరాలు నిర్జన ప్రాంతాలుగా మారాయని పేర్కొంది. 13 సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని వెల్లడించింది. భూతల దాడుల వార్తల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాన్ని ఇరాన్ హెచ్చరించింది. నెతన్యాహు, ట్రంప్ చేస్తోన్న మోసానికి మీ పిల్లలను బలిచేయకండంటూ హెచ్చరించింది.

# మార్కాపురం ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

- **ఈ ఘటన తీవ్రంగా కలచివేసిందన్న డిప్యూటి సిఎం పవన్**
- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం**

**బలగం టీవి, అమరావతి**

మార్కాపురం సమీపంలో రాయవరం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు సజీవ దహనమైన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 13 మంది సజీవ దహనం అయ్యారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి కి లోనయ్యానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను జిల్లా అధికార యంత్రాంగం నుంచి వివరాలు తీసుకున్నానని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా పవన్ కల్యాణ్ తెలిపారు. టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం అత్యంత విషాదకరమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ దుర్ఘటనలో పలువురు సజీవదహనం కావడంపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణమే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉన్నతాధికారు లను మంత్రి ఆదేశించారు. ఈ ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందగానే.. హుటాహుటిన విజయవాడ నుంచి రాయవరానికి హోం మంత్రి అనిత బయలుదేరారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఈ సందర్భంగా మంత్రి అనిత భరోసా ఇచ్చారు. ఈ ప్రమాద ఘటన

కారణంగా చేపట్టిన సహాయక చర్యలను మంత్రి అనిత ఎప్పటికప్పుడు అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. రాయవరం వద్ద ప్రమాద ఘటనలో మృతుల ఆత్మలకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 13 మంది ప్రయాణికులు సజీవ దహనం కావడంపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కటుంబాలకు అండగా ఉంటామన్నారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతులు, క్షతగాత్రుల వివరాలు సేకరించి.. వాటిని వారి బంధువులకు తెలియపర్చాలని మార్కాపురం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రయాణాల్లో నిబంధనలు పాటించాలని డ్రైవర్లకు సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటూ బస్సు డ్రైవర్లకు స్పష్టం చేశారు. బస్సుల్లో ప్రయాణికులను జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేర్చేలా చూడాలని వారిని మంత్రి సవిత కోరారు.

సజీవ దహనం ఘటన తీవ్ర ఆవేదనకు గురి చేసిందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. ఘటనాస్థలిలో బాధితులకు సహాయ చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి సూచించారు. ఈ ప్రమాద ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భాంక్ష్మి-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను మంత్రి గొట్టిపాటికి అధికారులు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బస్సులో ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన తన సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొట్టడంతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం అత్యంత విషాదకరమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు సజీవదహనం కావడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తక్షణమే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను అదేశించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను పూర్తిగా పరిశీలించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్ర దిగ్భాంక్ష్మి-రతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని.. అందుకోసం వారు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వైద్య నిపుణులను పంపించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. బాధితులకు భరోసా కల్పించాలని ఉన్నతాధికారులకు మంత్రి సత్య కుమార్ సూచించారు. రోడ్డు ప్రమాదంలో పలువురు మృతి చెందడం ఎంతో బాధ కలిగించిందని టీజీ భరత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మార్కాపురం జిల్లాలో బస్సు ప్రమాదంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రయాణికులు సజీవ దహనం కావడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని

స్పష్టం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. మరికొద్దిసేపటికి స్వస్థలాలకు చేరుకోవాల్సిన ప్రయాణీకులు సజీవ దహనం కావడం మాటలకు అందని విషాదమని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ తెలిపారు. క్షతగాత్రులకు సహకారం అందించాలని ప్రకాశం జిల్లా బీజేపీ నేతలను ఆదేశించామన్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారని.. వారి కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.



## బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

**బలగం టీవి, హైదరాబాద్**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా, బీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్యేలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, బీసీ కార్పొరేషన్‌లకు తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గొల్ల, కుర్మలతో పాటు మత్స్యకారులకు చేప పిల్లలను విడుదల చేయాలని కోరారు. బీసీలను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

## ఆస్తి వివాదం నేపథ్యంలో ఇంటికి పెట్రోలు పోసి నిప్పు

- **ముగ్గురి పరిస్థితి విషమం**

**బలగం టీవి, హైదరాబాద్**




వికారాబాద్ జిల్లా పరిగి మండలం రూప్‌సింగ్ తండాలో ఆస్తి వివాదం నేపథ్యంలో అర్ధరాత్రి ఇంటికి పెట్రోలు పోసి నిప్పంటించిన దారుణ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో తండ్రి, రెండో భార్యతో పాటు ఇద్దరు కుమారులు తీవ్రంగా కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నేనావత్ హన్మంత్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్య నాతిబాయి ఇటీవల మృతి చెందగా ఆమె పేరిట వచ్చిన రైతు బీమా రూ.5 లక్షలు, ఆస్తి పంపకాల విషయంలో పెద్ద భార్య కుమారుడు అనార్‌సింగ్‌తో హన్మంత్‌కు విభేదాలు ఏర్పడ్డాయి. ఈ వివాదం కారణంగా తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కక్ష పెంచుకున్న అనార్‌సింగ్ అర్ధరాత్రి సమయంలో తండ్రి ఇంటికి బయటనుంచి తలుపులు మూసివేసి, లీటర్ల కొద్దీ పెట్రోలు, డీజిల్ పోసి నిప్పంటించినట్లు సమాచారం. ఆ సమయంలో ఇంట్లో హన్మంత్, ఆయన రెండో భార్య రమణిబాయి, కుమారులు వెంకటేశ్, శివ నిద్రపోతున్నారు. మంటలు వ్యాపించడంతో వారు తీవ్రంగా కాలిన గాయాలకు గురయ్యారు. బాధితుల కేకలు విని ఇరుగుపొరుగు వచ్చి తలుపులు తెరిచి వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా రమణిబాయి, వెంకటేశ్‌కు 90 శాతం కాలిన గాయాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చిన్న కుమారుడు శివ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. నిందితుడు అనార్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# తెరుచుకున్న హోర్ముజ్ జలసంధి

- **సరుకు రావాణాకు ఇరాన్ అనుమతి**

**బలగం టీవి, హైదరాబాద్**

టెహ్రాన్,మార్చి26(ఆర్ఎన్ఎ): భారత్‌తో సహా మిత్ర దేశాలకు హోర్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ ద్వారా సరుకు రవాణా నౌకల రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ప్రకటించారు. భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లకు సరుకు రవాణాకు అనుమతి లభించింది. అబ్బాస్ అరఘ్చి స్పందన గురించి ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అభ్యర్థించారు. దీని నేపథ్యంలోనే ఇరాన్ ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించాలని గుటెర్రెస్ అమెరికా, ఇజ్రాయిల్‌లను కోరారు. 'హోర్ముజ్ జలసంధిని మూసివేయడం చమురు, గ్యాస్ రవాణాను స్తంభింపజేస్తోంది. ఈ ప్రాంతంలో, వెలుపల పౌరులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు, అభద్రతతో జీవిస్తున్నారు. సంఘర్షణ పరిణామాలను తగ్గించడానికి పోరాటాన్ని ముగించడమే సరైన నిర్ణయం' అని గుటెర్రెస్ ఒక ప్రకటనలో రాశారు.



# పంటపొలాల్లోనే ఏనుగుల తిష్ట

- **ఆందోళనలో రైతులు**

**బలగం టీవి, చిత్తూరు**

చంద్రగిరి మండలం, ఎగువ కూచివారిపల్లె పంట పొలాల్లో పగలు కూడా ఏనుగులు తిష్ట వేస్తున్నాయి. దీంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. కొన్ని రోజులుగా ఏనుగుల మంద గ్రామంలోని పంట పొలాలపై పడి బీభత్సం సృష్టిస్తోంది. సాధారణంగా రాత్రి వేళల్లో వచ్చే ఏనుగులు, ఇప్పుడు ఏకంగా పట్టపగలే పొలాల్లో తిష్టవేస్తుండటంతో రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. బుధవారం ఎగువ కూచువారి పల్లె రైతుల పొలాల్లో ఏనుగులు మామిడి తోటలు, ఇతర పంటలను తొక్కి వేయడమే కాకుండా, చెట్ల కొమ్మలను విరిచివేసి భారీ నష్టాన్ని కలిగించాయి. సాగునీటి పైపులను, మోటార్లను సైతం ధ్వంసం చేస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఏనుగులను అడవిలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా కేసు

- **వైసిపి నేతకు జైలు శిక్ష విధించిన కోర్టు**

**బలగం టీవి, చిత్తూరు**

శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వైసీపీ నాయకుడికి తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఎర్రావారిపాలెం మండలం యనమలవారిపల్లెకు చెందిన ఉటుకూరి చెంగల్‌రెడ్డి, తిమ్మసముద్రానికి చెందిన వెంకట్‌రెడ్డి 2015వ సంవత్సరంలో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిపై భాకరాపేట స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. చెంగల్‌రెడ్డిపై నేరం రుజువు కావడంతో తిరుపతి ఆర్ఎన్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి రెండేళ్ళ జైలు శిక్ష, రూ.20 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఇబిస2.తూణజరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సివుంటుందన్నారు. ఈ కీలకమైన కేసు విచారణ, పర్యవేక్షణ, కోర్టు లైజనింగ్‌లో కృషి చేసిన డీఎస్పీ ప్రసాద్, స్పెషల్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, అప్పటి ఎస్ఐ నెట్టి కంఠయ్య, ప్రస్తుత సీఐ సత్యనారాయణ, ఎస్ఐ కృష్ణయ్య, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ హరినాథ్,

కోర్టు హెడ్ కానిస్టేబుల్ నరసింహులును ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. శిక్ష పడిన చెంగల్‌రెడ్డి భార్య రెక్ష్మి-డడెమ్మ ప్రస్తుతం ఎర్రావారిపాలెం ఇన్‌చార్జ్ ఎంపీపీగా వుండగా చెంగల్‌రెడ్డి గతంలో మండల వైసీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈయనపై పలు ఎర్రచందనం అక్రమ కేసులు నమోదయ్యాయి.



# కాళేశ్వరం లింక్-2లో ఎత్తిపోతలు ప్రారంభం

- **ఎల్లంపల్లి నుంచి నంది రిజర్వాయర్‌కు గోదావరి జలాలు**

**బలగం టీవి, పెద్దపల్లి**

తెలంగాణ నీటి అవసరాలను తీర్చడంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లింక్-2కు అనుబంధంగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల ఎత్తిపోతలు గురువారం ప్రారంభమయ్యాయి. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం వద్దనున్న నంది పంప్‌హౌస్‌లో నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు 2, 3 మోటార్లను ప్రారంభించి జలాలను విడుదల చేశారు.

ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 6,300 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి అదే పరిమాణంలో జలాలు కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు జంట సొరంగాల ద్వారా తరలిపోతున్నాయి. గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరద కాలువకు నీటిని పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఎత్తిపోతలు మూడు రోజులపాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే జలాల ఎత్తిపోతలు నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.

# హైదరాబాద్‌తో బెంగళూరును పోల్చవద్దు: డీకే శివకుమార్

**బలగం టీవి, బెంగళూరు**

బెంగళూరు నగరాన్ని హైదరాబాద్‌తో పోల్చడం సరికాదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రపంచ టెక్ హబ్స్ జాబితాలో 6వ స్థానంలో ఉన్న బెంగళూరును, 26వ స్థానంలో ఉన్న హైదరాబాద్‌తో పోల్చడం తగదని ఆయన పేర్కొన్నారు. గురువారం కర్ణాటక శాసనసభలో బెంగళూరు అభివృద్ధిపై జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల విడుదలైన నివేదిక ప్రకారం ప్రపంచ టాప్-10 టెక్ హబ్స్‌లో బెంగళూరు స్థానం దక్కించుకుందని, శాన్ ఫ్రాన్సిస్కో మొదటి స్థానంలో, లండన్ రెండో స్థానంలో నిలిచాయని తెలిపారు. బీజింగ్ తర్వాత బెంగళూరు 6వ స్థానంలో ఉండగా, హైదరాబాద్ 26వ స్థానంలో ఉందని ఆయన వివరించారు. అందువల్ల హైదరాబాద్‌తో పోటీ పడాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి సీఎన్ అశ్వత్ నారాయణ్ మాట్లాడుతూ, దేశంలో బెంగళూరుతో పోల్చదగిన నగరం మరొకటి లేదన్నారు. జీవన వ్యయం పరంగా హైదరాబాద్ తక్కువగా ఉండొచ్చని, కానీ బెంగళూరులో ఉన్న ప్రతిభ, కాస్మోపాలిటన్ సంస్కృతి ప్రత్యేకమని తెలిపారు. బెంగళూరు అభివృద్ధిలో ప్రభుత్వాల పాత్ర పరిమితంగానే ఉందని అభిప్రాయపడ్డారు. అయితే ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు స్పందిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యాసంస్థల స్థాపన వల్లే బెంగళూరుకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, అదే ఐటీ విప్లవానికి బాటలు వేసిందని అన్నారు. ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ మాట్లాడుతూ, మీడియానే ఈ రెండు నగరాలను పోలుస్తోందని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఈ అంశం రాజకీయంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.

# ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల



బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రకటించింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు 20 మ్యాచ్‌లతో కూడిన తొలి దశ షెడ్యూల్‌ను మాత్రమే ప్రకటించిన బీసీసీఐ.. గురువారం మిగిలిన 50 మ్యాచ్‌ల వివరాలను వెల్లడించింది. మార్చి 28 నుంచి మే 24 వరకు లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. మే 31న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ఈ సీజన్‌కు తెరపడనుంది. అయితే ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. సెకండాఫ్ షెడ్యూల్‌లో 12 వేదికల్లో మొత్తం 50 మ్యాచ్‌లు జరగనుండగా.. ఇందులో 8 డబుల్ హెడర్స్ ఉన్నాయి. డబుల్ హెడర్స్ ఉన్న రోజున మధ్యాహ్నం 3:30 గంటలకు ఒక మ్యాచ్, రాత్రి 7:30 గంటలకు రెండో మ్యాచ్ మొదలవుతుంది. సెకండాఫ్ షెడ్యూల్‌లో తొలి మ్యాచ్ ఏప్రిల్ 13న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగనుంది. మొత్తంగా హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, న్యూ చండీగఢ్, రాయ్‌పూర్ వేదికల్లో ఐపీఎల్ 2026 మ్యాచ్‌లు జరగనున్నాయి. సెకండాఫ్ షెడ్యూల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మొత్తం 10 మ్యాచ్‌లు ఆడనుంది. ఉప్పల్ వేదికగా మొత్తం ఏడు మ్యాచ్‌లు జరగనున్నాయి. డేవిడ్ వార్నర్ సారథ్యంలో ఐపీఎల్ 2016 టైటిల్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. 2018, 2024లో ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయింది. ఈ సీజన్‌లోనైనా టైటిల్ గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది.

### క్యాచ్‌లపై బీసీసీఐ క్లారిటీ..!

బుధవారం జరిగిన కెప్టెన్ల సమావేశంలో క్యాచ్‌లపై బీసీసీఐ క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో క్యాచ్‌లకు సంబంధించిన వీడియోలను ప్లే చేసి 10 ఫ్రాంచైజీల కెప్టెన్లకు వివరించినట్లు సమాచారం క్లాజ్ 33.3 ప్రకారం బంతిపై ఫీల్డర్‌కు పూర్తి నియంత్రణ వచ్చినట్లు అంపైర్లు భావిస్తేనే ఔట్ ఇవ్వడం జరుగుతుందని బీసీసీఐ పేర్కొన్నట్లు తెలుస్తోంది. అందుకోసం గత టీ20 ప్రపంచ కప్‌లో కాస్త చర్చకు దారితీసిన క్యాచుల వీడియోలను ప్రదర్శించినట్లు వార్తలు వస్తున్నాయి.





# సీజన్ మధ్యలో బరిలోకి దిగుతా

- కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెల్లడి

బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గుడ్ న్యూస్ చెప్పాడు. వెన్ను గాయంతో బాధపడుతున్న తాను వేగంగా కోలుకుంటున్నానని, సీజన్ మధ్యలో బరిలోకి దిగుతానని తెలిపాడు. ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్ సందర్భంగా వెన్ను గాయానికి గురైన ప్యాట్ కమిన్స్.. అప్పటి నుంచి ఆటకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ గాయం కారణంగానే అతను ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కూడా ఆడలేదు. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు కూడా ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. అతని గైర్హాజరీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ బాధ్యతలను ఇషాన్ కిషన్‌కు అప్పగించారు. గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు దూరమైనా.. ప్యాట్ కమిన్స్ బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో కలిసాడు. గాయంతో ఇబ్బంది పడుతున్నా జట్టుతో కలిసి అతను ప్రయాణించనున్నాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కమిన్స్ పాల్గొన్నాడు. వార్మప్‌లు, ఫీల్డింగ్, క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్‌తో ఖాళీ నెట్స్‌లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు.తాజాగా టీమ్ సోషల్ మీడియా టీమ్‌తో మాట్లాడిన కమిన్స్.. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టుకు అందుబాటులోకి వస్తానని చెప్పాడు. 'నేను వెన్ను గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నా. ప్రస్తుతం నేను బాగానే ఉన్నా. చిన్నగా నెట్స్‌లో బౌలింగ్ కూడా చేయగలుగుతున్నా. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. కానీ నేను ఆరంభ మ్యాచ్‌లు ఆడలేకపోతున్నా.టోర్నీ మధ్యలో జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అంతా అనుకున్నట్లు జరిగితే నేను టోర్నీ రెండో భాగం, ఫైనల్స్‌లో మైదానంలోకి దిగుతాను' అని కమిన్స్ తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా తొలి మ్యాచ్ చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం(మార్చి 28న) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే.


# ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల బ్లాక్ దందా..


- కర్ణాటక ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

బలగం టీవి, బెంగళూరు

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌కు ముందే బెంగళూరులో టికెట్ల లొల్లి మొదలైంది. మార్చి 28న స్థానిక చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ హై ఓల్టేజ్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల పంపిణీ వ్యవహారం ఇప్పుడు కర్ణాటకలో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. మ్యాచ్ చూసేందుకు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత పాస్‌లు లేదా వీఐపీ టికెట్లు ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ స్థలంలో స్టేడియం నిర్మించుకుని, ప్రభుత్వం నుంచి అన్ని రకాల మౌలిక సదుపాయాలు, ఇతర సహకారాలు పొందుతున్న కేఎస్‌సీఏ కనీసం ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేల కుటుంబాలకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమంటూ ఆయన బహిరంగంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. మార్చి 28న జరిగే తొలి మ్యాచ్ కోసం మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇప్పటివరకు ఎలాంటి టికెట్లు కేటాయించలేదని కాశప్పనవర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సౌకర్యాలు వాడుకుంటూనే తమను కేఎస్‌సీఏ అధికారులు అవమానిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులైన తాము సామాన్యుల్లా క్యూలైన్లలో నిలబడి టికెట్లు కొనుగోలు చేయలేమని తేల్చి చెప్పారు. కాబట్టి ప్రొటోకాల్ ప్రకారం ఒక్కో ఎమ్మెల్యేకు కనీసం ఐదు వీఐపీ టికెట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వీఐపీల హోదాను దృష్టిలో ఉంచుకుని క్రికెట్ అసోసియేషన్ తగిన విధంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. కేవలం వీఐపీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, టికెట్ల విక్రయాల్లో కేఎస్‌సీఏ భారీ అక్రమాలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు చేశారు. బ్లాక్ మార్కెట్‌లో టికెట్లను యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని విమర్శించారు. అధికారికంగా రూ.5 వేల ధర ఉన్న టికెట్‌ను రూ.35 వేలకు అక్రమంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే టికెట్లు అన్నీ అమ్ముడైపోయినట్లు చూపిస్తున్నారని, దీని వెనుక పెద్ద దందా నడుస్తోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలతో ఈ వివాదం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. మరోవైపు సామాన్య క్రికెట్ అభిమానులు సైతం టికెట్ల విక్రయాల్లో పారదర్శకత లోపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి ఆన్‌లైన్‌లో వేచి చూసినా టికెట్లు దొరకడం లేదని ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలు టికెట్లు ఎవరికి అమ్ముతున్నారో క్రికెట్ బోర్డు స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎమ్మెల్యే చేసిన ఈ తీవ్రమైన ఆరోపణలు, బ్లాక్ మార్కెటింగ్ విమర్శలపై కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరణ ఇవ్వలేదు.







# చరిత్ర సృష్టించనున్న భువనేశ్వర్ కుమార్

బలగం టీవి, హైదరాబాద్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుస్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్.. సరికొత్త చరిత్రను లిఖించేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా తన పాత జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు తీస్తే వరల్డ్ రికార్డ్ నమోదు చేయనున్నాడు. ఐపీఎల్ కెరీర్‌లోనే 200 వికెట్లు తీసిన తొలి పేసర్‌గా చరిత్రకెక్కనున్నాడు. ఇప్పటివరకు 190 మ్యాచులు ఆడిన ఈ ఆర్సీబీ స్వింగ్ కింగ్ 27.33 సగటుతో 198 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండు ఐదు వికెట్ల ప్రదర్శనలు, రెండు నాలుగు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మాత్రమే అతని కంటే ముందున్నాడు. అత్యధిక ఐపీఎల్ వికెట్లు తీసిన పేసర్ల జాబితాలో భువనేశ్వర్ కుమార్ తర్వాత ముంబై ఇండియన్స్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఉన్నాడు. అతను 145 మ్యాచుల్లో 22.02 సగటుతో 183 వికెట్లు తీశాడు. చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ప్లేయర్ డ్వేన్ బ్రావో 161 మ్యాచుల్లో 183 వికెట్లతో బుమ్రా సరసన నిలిచాడు. ఈ సీజన్‌లో బుమ్రా 200 వికెట్ల మైలురాయి అందుకునే అవకాశం ఉంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో భువనేశ్వర్ కుమార్‌ను ఆర్సీబీ రూ.10.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వేలంలో లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ జట్లతో పోటీపడి మరి కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో 14 ఇన్నింగ్స్‌ల్లో 17 వికెట్లతో ఆర్సీబీ విజయంలో భువీ కీలక పాత్ర పోషించాడు. ఆర్సీబీ తరపున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు.36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్‌కు కొత్త బంతితో అద్భుతమైన రికార్డు ఉంది. పవర్‌ప్లే ఓవర్లలో అతను అత్యధికంగా 79 ఐపీఎల్ వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో ముంబై ఇండియన్స్ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ మాత్రమే ఈ భారత వెటరన్‌కు దగ్గరగా ఉన్నాడు. పవర్‌ప్లేలో తీసిన మొత్తం 79 వికెట్లలో 29 వికెట్లను ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే పడగొట్టడం అతని ప్రత్యేకత. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన గత మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ 43 పరుగులిచ్చి ఒకే వికెట్ తీసాడు. ట్రావిస్ హెడ్ మాత్రమే ఔట్ చేశాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 94 పరుగులతో అజేయంగా నిలిచాడు.

# మరో టైటిల్‌పై సన్‌రైజర్స్ గురి



బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో టైటిల్‌పై గురిపెట్టింది. చివరగా ఆరెంజ్ ఆర్మీ డేవిడ్ వార్నర్ సారథ్యంలో 2016లో టైటిల్ అందుకుంది. ఆ తర్వాత 2018, 2024 సీజన్లలో ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయింది. గతేడాది పేలవ ప్రదర్శనతో ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సారైనా మెరుగైన ప్రదర్శన చేసి టైటిల్ అందుకోవాలనే కసితో ఉంది. అయితే ఫిట్‌నెస్ సమస్యలతో ప్యాట్ కమిన్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడం జట్టుకు గట్టి ఎదురుదెబ్బ. విధ్వంసకర బ్యాటర్లతో బ్యాటింగ్ విభాగం బలంగా ఉన్నా బౌలింగ్ విభాగం బలహీనంగా ఉంది. ప్యాట్ కమిన్స్ లేని లోటును తీర్చే బౌలర్ ఎవరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అంతేకాకుండా వేలంలోకి వదిలేసిన మహమ్మద్ షమీ స్థానాన్ని భర్తీ చేసే బౌలర్ ఎవరూ జట్టులో కనిపించడం లేదు. దాంతోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 250o పరుగులు చేసినా మ్యాచ్ గెలవలేదని ఆకాశ్ చోప్రా వంటి విశ్లేషకులు బల్ల గుద్ది చెబుతున్నారు. విధ్వంసకర బ్యాటర్లు జట్టులో ఉన్నా.. దూకుడుగా ఆడి ఆల్‌టైమ్ రికార్డు స్కోర్లు నమోదు చేసినా.. జట్టు గెలుస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. గత సీజన్‌లోనూ పేలవ బౌలింగ్ సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. ప్రాక్టీస్‌లో ఆరెంజ్ ఆర్మీ విధ్వంసకర బ్యాటర్లే దూకుడుగా ఆడి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారనే వాదన కూడా ఉంది. ఈ క్రమంలోనే దూకుడే జట్టుకు బలం, బలహీనతగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన మ్యాచ్‌ల్లో గెలవగా.. స్లో వికెట్స్‌పై ఓటమిపాలైంది. కాస్త నెమ్మదిగా ఉన్న పిచ్‌పై సన్‌రైజర్స్ బ్యాటర్లు తేలిపోతుండగా.. బౌలర్లు పూర్తిగా చేతులెత్తేస్తున్నారు.ఈ సమస్యను అధిగమించేందుకే సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ బౌలర్లను కొనుగోలు చేసింది. స్మరణ్ రవిచంద్రన్, హర్ష్ దూబె, శివాంగ్ కుమార్, ప్రఫుల్ హింగె, శివమ్ మావి, సకిబ్ హుస్సేన్, క్రైనిస్ ఫులెట్రా అనే బౌలర్లను కొనుగోలు చేసింది. అయితే ఇందులో మెజార్టీ ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడిన అనుభవం లేదు. వీళ్లలో ఏ ఇద్దరు అసాధారణ ప్రదర్శన కనబర్చినా సన్‌రైజర్స్ బౌలింగ్ కష్టాలు తీరుతాయి. లేదంటే జట్టు మరోసారి ప్లే ఆఫ్స్ చేరకుండా అస్సాం ట్రైన్ ఎక్కాల్సిందే.



# రూ. 16 వేల కోట్లు పలికిన బెంగళూరు..

బలగం టీవి, హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే అత్యంత భారీ డీల్ ఒకటి చోటుచేసుకుంది. అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చేతులు మారింది. ఇప్పటివరకు యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ యాజమాన్యంలో ఉన్న ఈ జట్టును, ప్రముఖ వ్యాపార దిగ్గజం ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం కొనుగోలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ భారీ డీల్ విలువ అక్షరాలా 1.78 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 16,000 కోట్లు). ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుండి అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీగా ఇది రికార్డు సృష్టించింది. ఈఎస్పీఎన్ క్రిక్ ఇన్ఫో కథనం ప్రకారం.. ఆర్సీబీ విక్రయ ప్రక్రియలో అనేక బడా కంపెనీలు పోటీ పడ్డాయి. అయితే, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌లు కలిసి ఒక కన్సార్టియంగా ఏర్పడి అత్యధిక బిడ్ దాఖలు చేసినట్లు సమాచారం. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు ఈ జట్టును సుమారు 111.6 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు అది 15 రెట్లు ఎక్కువ ధర పలకడం విశేషం. ఆర్సీబీ జట్టుకు ఇప్పటివరకు ఒక్క ఐపీఎల్ టైటిల్ కూడా లభించకపోయినప్పటికీ, ఆ జట్టుకున్న బ్రాండ్ వాల్యూ మరియు ఫ్యాన్ బేస్ అసాధారణం జట్టులో విరాట్ కోహ్లీ ఉండటం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఈ జట్టుకు విపరీతమైన క్రేజ్ ఉంది. "ఈ సారి కప్పు మనదే") అనే స్లోగన్‌తో బెంగళూరు అభిమానులు జట్టుకు ఇచ్చే మద్దతు ఏ జట్టుకైనా అసూయ కలిగిస్తుంది. వ్యాపార పరంగా బెంగళూరు నగరం ఒక పెద్ద హబ్ కావడం, అక్కడ ఉండే స్టేడియం వాతావరణం స్పాన్సర్లకు పెద్ద ఆకర్షణ. ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి దిగ్గజ సంస్థ జట్టు బాధ్యతలు చేపట్టడం వల్ల ఆర్సీబీ వ్యూహాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది. కేవలం మైదానంలో ఆట తీరునే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఆర్సీబీ బ్రాండ్‌ను మరింత విస్తరించాలని కొత్త యాజమాన్యం భావిస్తోంది. అలాగే, జట్టుకు ఎంతో కాలంగా ఊరిస్తున్న 'ఐపీఎల్ టైటిల్'ను ఎలాగైనా గెలవడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని కన్సార్టియం వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ విక్రయంతో ఐపీఎల్ జట్ల విలువ ఒక్కసారిగా ఆకాశాన్ని తాకింది. ఇతర జట్లైన ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ విలువలు కూడా దీనికంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. బిసిసిఐకి కూడా ఈ డీల్ వల్ల భారీ ఆదాయం సమకూరనుంది.

# టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వడమే నా లక్ష్యం

- ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ పృథ్వీ షా వ్యాఖ్యలు

బలగం టీవి, హైదరాబాద్

టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వడమే తన లక్ష్యమని ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ పృథ్వీ షా అన్నాడు. అందుకోసం ఎంతకైనా తెగిస్తానని, 200 శాతం కష్టపడుతానని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ వేలంలో అన్‌సోల్డ్‌గా నిలిచిన పృథ్వీ షాను ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కనుకరించి రూ.75 లక్షల కనీస ధరతో కొనుగోలు చేసింది.అతనికి తుది జట్టులో చోటు దక్కుతుందా? లేదా?అనేది గ్యారెంటీ లేదు. ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో ఓ వార్తా ఎజెన్సీతో మాట్లాడిన పృథ్వీ షా.. టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వడమే తన ఏకైక లక్ష్యమని చెప్పాడు. 'టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వడం కోసం నేను ఇంకా క్రికెట్ ఆడుతున్నాను. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. అందుకోసం నేను చాలా కష్టపడుతున్నాను. గతంలో కంటే మూడు రెట్లు ఎక్కువ కష్టపడుతున్నాను. వాస్తవానికి ఈ విషయం గురించి మాట్లాడటానికి నాకు ఇష్టం లేదు. కానీ భారత జట్టులోకి తిరిగి రావడానికి, ట్రోఫీని గెలవడానికి నా సాయశక్తులా ప్రయత్నిస్తాను. జట్టు విజయం కోసం 100 శాతం కాదు.. 200 శాతం కృషి చేస్తాను.గత కొన్నేళ్లుగా నేను ఎన్నో ఒడిదుడుకులను



ఎదుర్కొన్నాను. వాటన్నింటినీ నేను చిరనవ్వుతో స్వీకరించాను. నేను తిరిగి జట్టులోకి వచ్చినా.. అవన్నీ నా మనసులోనే ఉంటాయి. టీమిండియాలోకి రావాలంటే ఒకటే మార్గం. కష్టపడాలి.. సాయశక్తుల కృషి చేయాలి. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి.ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టులో చోటు గురించి ఆలోచించడం లేదు. ఒకవేళ కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగితే.. అతనితో కలిసి ఎవరు ఆడినా బాగా ఆడాలి. నేనే ఓపెనింగ్ చేయాలని కోరుకోవడం లేదు. ఎవరు ఓపెనింగ్ చేసినా.. జట్టుకు విజయాన్ని అందించాలి.తుది జట్టులో ఖచ్చితంగా పోటీ ఉంది. మీరు రంజీ ట్రోఫీ ఆడినా.. ఐపిఎల్ , టీమిండియా, ఇండియా–ఏ తరపున ఆడినా క్రికెట్‌లో పోటీ అనేది ఉంటుంది. ప్రస్తుతం 10 మంది ఓపెనర్లు ఉన్నారు. కాబట్టి పోటీ ఖచ్చితంగా ఉంటుంది.'అని పృథ్వీ షా చెప్పుకొచ్చాడు. అండర్ 19 ప్రపంచకప్ విజయంతో భారత క్రికెట్‌లోకి తారాజువ్వలా దూసుకొచ్చిన పృథ్వీ షా అంతే వేగంగా జట్టుకు దూరమయ్యాడు. టీమిండియా భవిష్యత్తు సారథి అవుతాడని ప్రశంసలు అందుకున్న ఈ ముంబై కుర్రాడు.. ప్రస్తుతం ఐపీఎల్‌లోనూ నిలదొక్కుకోలేకపోతున్నాడు. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో పాటు చెడు స్నేహాలు పృథ్వీ షా కెరీర్‌ను నాశనం చేశాయి.

# పాకిస్థాన్ ఆటగాళ్లపై వార్నర్ ఆగ్రహం



బలగం టీవి, హైదరాబాద్

పాకిస్థాన్ ఆటగాళ్లపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ ప్రీమియం ఆటగాళ్లకు కనీస ఇంగిత జ్ఞానం లేదని, ప్రెస్‌మీట్‌లో ఎలా ఉండాలో కూడా తెలియదని అసహనం వ్యక్తం చేశాడు.పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్ నేపథ్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డేవిడ్ వార్నర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) 2026 సీజన్‌కు నేడు తెరలేవనుంది. ఈ క్రమంలో బుధవారం లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో కెప్టెన్ల రౌండ్ టేబుల్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ టోర్నీలో కరాచీ కింగ్స్‌కు సారథ్యం వహిస్తున్న డేవిడ్ వార్నర్.. పాక్ ఆటగాళ్ల తీరును తప్పుబడుతూ అసహనం వ్యక్తం చేశాడు.ప్రెస్ మీట్‌లో వార్నర్ తన జట్టు వ్యూహాల గురించి సీరియస్‌గా వివరిస్తుండగా.. పక్కనే కూర్చున్న ఇతర జట్ల కెప్టెన్లు షాహీన్ అఫ్రిది, మహ్మద్ రిజ్వాన్, సౌద్ షకీల్ ఒకరిపై ఒకరు జోకులు పేల్చుకుంటూ నవ్వుకున్నారు. వార్నర్ చెప్పే మాటలను పట్టించుకోలేదు. దాంతో అతను తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. 'అసలు ఇక్కడ ఏం జరుగుతోంది? ఇలా అడుగుతున్నందుకు క్షమించండి. ఇక్కడ కొంతమంది స్కూల్ పిల్లల్లా ప్రవర్తిస్తున్నారు. వీళ్లు తమను తాము ప్రీమియం ప్లేయర్స్ అని పిలుచుకుంటున్నారు. కానీ వీరి ప్రవర్తన మాత్రం చిన్న పిల్లల కంటే అధ్వాన్నంగా ఉంది. ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఎలా ప్రవర్తించాలో కూడా వీరికి తెలియదా?'అని మండిపడ్డాడు.డేవిడ్ వార్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. వార్నర్‌ను కొందరు తప్పుబడుతుంటే మరికొందరు సమర్థిస్తున్నారు. అంతర్జాతీయ ప్రెస్ మీట్స్‌లో ప్రొఫెషనలిజం ఉండాల్సిందేనని వార్నర్‌కు మద్దతు తెలుపుతున్నారు. ముఖ్యంగా వార్నర్ లాంటి సీనియర్ ప్లేయర్ మాట్లాడుతున్నప్పుడు తోటి ఆటగాళ్లు గౌరవం ఇవ్వకపోవడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

# రామ్‌చరణ్ కంటికి స్వల్ప సర్జరీ




## డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన చిరు

'పెద్ది' సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా రామ్ చరణ్ కంటికి గాయం కావడంతో, మెగా కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ కొంత ఆందోళన నెలకొంది. అయితే, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ సర్జరీ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా డాక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సమయంలో తమకు కలిగిన ఆందోళనను డాక్టర్ తన మాటలతో, పనితనంతో పోగొట్టారని ఆయన వివరించారు. డాక్టర్ సుధాకర్ ప్రసాద్ గారు, చరణ్ కంటికి మీరు ఎంతో నైపుణ్యంతో, సకాలంలో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. తొలుత మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ.. మీరు చెప్పిన మాటలు మా భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చాయి. సకాలంలో స్పందించి చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు. తండ్రిగా తన కొడుకు ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధను, వైద్యుడిపై ఉన్న గౌరవాన్ని ఈ పోస్ట్ ద్వారా చిరంజీవి చాటుకున్నారు. సర్జరీ విజయవంతం కావడంతో రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల సూచనల మేరకు కొద్దిరోజుల విరామం తర్వాత ఆయన తిరిగి 'పెద్ది' షూటింగ్‌లో పాల్గొననున్నారు. అయితే, మెగాస్టార్ స్వయంగా అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకుని, రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పెద్ది టీమ్ కూడా స్పందించింది. చరణ్ తిరిగి షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్టుగా తెలిపింది. గాయం చిన్నదే కావడంతో సినిమా పనులకు పెద్దగా ఆటంకం కలగదని రామ్ చరణ్‌తో పాటు చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న పెద్ది రిలీజ్ కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

# ధురంధర్ ప్రచారంపై చర్యలు తప్పవు


## దర్శకుడు ఆదియ ధర్ హెచ్చరిక

దర్శకుడు ఆదిత్య ధర్ తన తాజా చిత్రం 'ధురంధర్: ది రివెంజ్' పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై స్పందించారు. నెట్టింట వైరల్ అవుతున్న ఒక మార్ఫింగ్ ఫోటోపై ఆయన స్పష్టతనిచ్చారు. అది సినిమాకు సంబంధించినది కాదంటూ పోస్ట్ పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా 'ధురంధర్2' చిత్రానికి లభిస్తోన్న ఆదరణ చూసి నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది. అయితే, కొంతమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి మా అధికారిక ప్రోమోలను మారుస్తూ తప్పుడు కథనాలను సృష్టిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా, ఈ చిత్రంలోని హంజా (జస్కీత్) పాత్ర తలపాగా ధరించి సిగరెట్ తాగుతున్నట్లు ఉన్న ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది పూర్తిగా అబద్ధం. మా సినిమాలో కానీ, మేము విడుదల చేసిన ఏ ఇతర అధికారిక వీడియోల్లో కానీ అలాంటి సీన్ లేదు. ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించాలని కొందరు చేస్తోన్న పని. సిక్కులు అంటే నాకెంతో గౌరవం. ఈ చిత్రంలో ప్రతి పాత్రను ఎంతో బాధ్యతతో వారిపై గౌరవంతోనే చిత్రీకరించాం. ఏఐతో సృష్టించిన ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరుతున్నాను. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటాను అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కిన 'ధురంధర్ 2' మార్చి 19న విడుదలైంది. తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఏడు రోజుల్లో రూ.1000కోట్ల క్లబ్‌లో చేరినట్లు సినీ వర్గాలు




వెల్లడించాయి. ఇప్పటివరకూ రూ.1,006 కోట్లు తన ఖాతాలో వేసుకుంది.

# ఉస్తాద్‌లో పవన్ కళ్యాణ్ ఎంట్రీ అదుర్స్




## ప్రేక్షకుల స్పందనపై హరీష్ కామెంట్స్

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'సినిమాలో పవన్ ఎంట్రీ సీన్‌పై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోల్స్‌పై హరీశ్ శంకర్ స్పందించారు. ఆయన జీప్‌లో నుంచి రెండుసార్లు దిగడం ఒకే సీన్‌లో చూపించారని కొందరు విమర్శించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ తనకు రెండు ఎంట్రీలు నచ్చాయని అందుకే పెట్టినట్లు తెలిపారు. కొన్నికొన్ని సన్నివేశాల్లో స్వేచ్ఛ తీసుకుంటా. ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ (ఖజీలిజీని ఐజీ÷ూజీని) ఫస్ట్ జీప్‌లో నుంచి దిగుతారు. ఆ సమయంలో ఒక బాడీ పడుతుంటే ఆయన దిగడం చూపించా. ఆ తర్వాత మళ్లీ జీప్ నుంచి జంప్ చేస్తూ కిందకు వస్తారు. ఇదేంటి రెండుసార్లు ఎలా దిగారని కొందరు అన్నారు. అలాంటివి పట్టించు కోను. నాకు రెండు షాట్లూ నచ్చాయి. నేను ఒక షాట్ తీశా. మాస్టర్ ఇంకోటి తీశారు. రెండూ బాగున్నాయి అనిపించింది. నచ్చాయి అంటే లాజిక్‌లను పట్టించుకోను. 'ధురంధర్ 2' కలెక్షన్స్ చూసి నాకు కూడా ఆనందంగానే ఉంది. మీరు గమనిస్తే.. నేను ఉస్తాద్‌లో చూపించిన దేశభక్తిని ఆదిత్యధర్ పూర్తిస్థాయిలో 'ధురంధర్ 2'లో చూపించారు. నా భావాల తో నాకు నచ్చిన సినిమా.. నా చిత్రం కంటే బాగా హిట్ అవుతోంది అన్నప్పుడు ఒకరకమైన ఆనందం ఉంటుంది కదా.. నేను ఇప్పుడు అదే సంతోషంలో ఉన్నాను. మనమందరం సినిమా లవర్స్. ఏ సినిమా విజయం సాధించినా ఆనందమే. ఇన్నేళ్ల నా కెరీర్‌లో చాలా తక్కు వ సినిమాలు చేశాను. నేను తొమ్మిది సినిమాలు చేస్తే.. దాదాపు 10 చిత్రాలు క్యాన్సిల్ చేశా. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. స్క్రిప్ట్ కుదరకపోవడం, హీరో చివరి నిమిషంలో క్యాన్సిల్ చేయడం.. ఇలా ఎన్నో ప్రాజెక్టులు చేయలేకపోయా. ఎన్టీఆర్‌తో 'ఎంఎల్ఏ' చేద్దాం అనుకున్నా. కానీ, కుదర్లేదు. క్యాన్సిల్ అయిన ప్రాజెక్టులకు వర్క్ చేసి కూడా పట్టాలెక్కించలేకపోయా. ఇకనుంచి అలా జరగదు. చాలా కథలు రాసుకున్నా. వరుసగా తెరకెక్కిస్తాను.


## వివక్ అగ్నిహోత్రి మూవీ...ఆపరేషన్ సిందూర్

'ది కాశ్మీర్ ఫైల్స్', 'ది వ్యాక్సిన్ వార్' వంటి వివాదస్పాద చిత్రాలతో సంచలనం సృష్టించిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించాడు. 'ఆపరేషన్ సిందూర్' అనే టైటిల్‌తో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం కోసం ఆయన ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్‌తో (టీ-సిరీస్) చేతులు కలిపినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ 'టైనీ' ధిల్లాన్ రాసిన పుస్తకం ఆధారంగా తెరకెక్కుతోంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, భారత సాయుధ దళాలలోని వివిధ విభాగాలు సమన్వయంతో సాగించిన లోతైన పరిశోధనల ఆధారంగా ఈ కథను రూపొందించారు. కేవలం శబ్దం చేయడం కోసం కాకుండా, వాస్తవాలను క్లారిటీతో, సినిమా మాయాజాలంతో




ప్రపంచానికి చాటి చెప్పడమే తమ లక్ష్యమని వివేక్ అగ్నిహోత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. పల్లవి జోషి, వివేక్ అగ్నిహోత్రి తమ 'ఐ యామ్ బుద్ధ' ప్రొడక్షన్స్‌పై టీ-సిరీస్‌తో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు

# తెరపైకి మరో రామాయణ కావ్యం




## వాల్మీకి రామాయణ పోస్టర్ విడుదల

భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుంది జాతీయ అవార్డు గ్రహీత, దర్శకురాలు భావనా తల్వార్. ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'వాల్మీకి రామాయణం'. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. భక్తి మరియు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శ్రీరాముడి పాదాలను చూపించడం విశేషం. 'పర్వతాలు ఉన్నంత కాలం, నదులు ప్రవహించినంత కాలం రామాయణం జీవించే ఉంటుంది' అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. చాలా ఏండ్ల తర్వాత భావనా తల్వార్ మెగాఫోన్ పట్టి ఈ సినిమా తెరకెక్కిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తుండగా.. బినోద్ ప్రధాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. రసూల్ పూకుట్టి సౌండ్ డిజైన్ అందిస్తున్నాడు. ఆనంద్ నీలకంఠన్ మరియు చంద్రప్రకాష్ ద్వివేది కథను అందిస్తున్నారు. మరోవైపు ఈ భారీ పౌరాణిక చిత్రం గాంధీ జయంతి సం ద ర్భం గా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# రణ్‌వీర్ తదుపరి చిత్రంపై ఆసక్తి



'ధురంధర్ 2' బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. 7 రోజుల్లోనే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ స్పై థ్రిల్లర్.. టూ థౌజండ్ క్రోర్ దిశగా దూసుకెళుతోంది. ఈ మూవీ గ్రాండ్ సక్సెస్ తర్వాత రణవీర్ సింగ్ తదుపరి ఏ మూవీ చేయబోతున్నాడన్న ఆసక్తి అందరిలో నెలకొంది. అయితే ధురంధర్ ఊహించని హిట్ తర్వాత పర్హాన్ అక్తర్‌కు హ్యాండిచ్చాడు గల్లీబాయ్. 'డాన్ 3' ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. అంతకు ముందు సౌత్ దర్శకులు ప్రశాంత్ వర్మ, బాసిల్ జోసెఫ్‌తో కొంత కాలం ట్రావెల్ చేసి.. వాళ్ల టైం, ఎనర్జీని వేస్ట్ చేయించి తర్వాత గుడ్ బై చెప్పిన ఎక్స్‌పీరియన్స్ ఈ హీరోది. బోయపాటి శీను, ఎస్ శంకర్ కూడా రణవీర్ సింగ్‌ను సెట్ చేసేందుకు ట్రై చేస్తున్నారట. కానీ రణవీర్ మాత్రం ఓ బాలీవుడ్ దర్శకుడికి కమిటయ్యాడని తెలుస్తోంది. రణవీర్ నెక్ట్స్ జాంబిస్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. స్కామ్ 1992 అసిస్టెంట్ డైరెక్టర్, లూటేరే సిరీస్ తెరకెక్కించిన జై మెహతా ఈ సినిమాను దర్శకత్వం వహించబోతున్నట్లు తెలుస్తోంది. ప్రళయ్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు సమాచారం. లోకతో పాపులారిటీ సంపాదించుకున్న కళ్యాణి ప్రియదర్శన్.. రణవీర్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతోందట. జులై లేదా ఆగస్టు నుంచి ఈ మూవీ సెట్స్ పైకి వెళ్లనుందని బీటౌన్ టాక్.